

వర్షపు నీటితో వాగును తలపిస్తున్న ఒంగోలులోని కర్నూల్ రోడ్డు

# ముసురుపట్టి.. ముంచెత్తి..!

## జిల్లాపై వాయుగుండం ప్రభావం



మంగమూరు వద్ద నల్లవాగు పొంగడంతో పహారా కాస్తున్న కానిస్టేబుల్



తర్లుపాడు వద్ద ఉరకెత్తుతున్న మిర్చి



ఊళ్లపాలెం తీరం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఆకాశ గంగా..



ప్రముఖ శైవక్షేత్రమైన సీఎస్‌పురం మండలంలోని భైరవకోన వద్ద ఉన్న జలపాతం కనువిందు చేస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలనురగలా కొండపై నుంచి నీరు కిందికి దుముకుతోంది. నీటి ఉధృతి తీవ్రంగా ఉండటంతో పర్యాటకులను, సందర్శకులను అధికారులు అనుమతించడం లేదు.
- ఆంధ్రజ్యోతి, సీఎస్‌పురం(పామూరు)

జిల్లాపై వాయుగుండం ప్రభావం తీవ్రంగానే ఉంది. ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతంలో ముసురుపట్టి వర్షం పడుతోంది. దీంతో కొన్నిచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ఒంగోలు నగరంలో భారీ వర్షం కురవడంతో శివారు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లు తటాకాలను తలపించాయి. మరోవైపు పశ్చిమ ప్రాంతంలో పంటలకు ప్రతికూల పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పత్తి, మిర్చి దెబ్బతింటున్నాయని, ఇంకా వర్షం ఎక్కువైతే ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. తీరప్రాంతంలో పర్యటించి మత్స్యకారుల బోట్లు, వలలను ఒడ్డుకు చేర్చుకోవాలని సూచించారు.

- 42 గంటల్లో 53.0 మి.మీ వర్షపాతం
- తూర్పు, దక్షిణ ప్రాంతాలలో భారీ వర్షం
- పొంగిన వాగులు, వంకలు, దెబ్బతిన్న రోడ్లు
- ఒంగోలులో శివారు కాలనీలు జలమయం
- పశ్చిమాన పంటలకు ప్రతికూలం
- ఉరకెత్తుతున్న పత్తి, మిర్చి మొక్కలు
- అధికారులతో మాట్లాడిన మంత్రి డాక్టర్ స్వామి
- సింగరాయకొండలో పర్యటించిన కలెక్టర్
- నేడు, రేపు కూడా వర్షాలు కురిసే అవకాశం

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈశాన్య రుతుపవనాల కారణంగా పది రోజులుగా జల్లులు పడుతున్నాయి. ఈక్రమంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ఒక మోస్తరు వర్షం ప్రారంభమై మంగళవారం రాత్రి, తిరిగి బుధవారం పగటి పూట కూడా విస్తారంగా జల్లులు పడ్డాయి. తెరపి లేకుండా ప్రతి గంటకు ఏదో ఒకస్థాయిలో జల్లులు పడుతూనే ఉండటం ప్రజానీకానికి తీవ్ర ఇబ్బంది కలిగించింది. అలా సోమవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం నాలుగు గంటల వరకు 42 గంటల వ్యవధిలో జిల్లాలో 53.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 వరకు 24 గంటల్లోనే 26.9 మి.మీ కురిసింది. బుధవారం పగటి పూట ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య దాదాపు 17.7 మి.మీ పడింది.

### పొంగిన వాగులు

అల్పపీడన ప్రభావంతో 42గంటల్లో 53.0 మి.మీ వర్షం పడటంతో అన్ని ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు పెరిగాయి. ఈ వ్యవధిలో గరిష్ఠంగా కొత్తపట్నం మండలంలో 124.0, ఒంగోలు అర్బన్‌లో 107.8, ఒంగోలు రూరల్‌లో 107.3, సింగరాయకొండలో

మిగతా 6వ పేజీలో

# మార్కాపురం జిల్లాపై ముందడుగు

- ప్రకాశంలోకి అద్దంకి, కందుకూరు
- ఆమేరకు జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్‌ఏ ఉన్నతాధికారుల సమీక్ష
- నివేదికలు ఇవ్వాలని ఆదేశం
- జనవరికే కొత్త జిల్లాలు వచ్చే అవకాశం?

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంలో దూకుడుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనపై మరో ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో బుధవారం ఉన్నతాధికారులు రంగంలోకి వచ్చి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం కలెక్టర్ రాజాబాబుకు.. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశంలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. దీంతో వచ్చే జనవరి నాటికే మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు ఒంగోలు కేంద్రంగా కొనసాగే ప్రకాశం జిల్లాలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను కలిపే అవకాశం ఉంది. బుధవారం కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్‌ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ ఆయా అంశాలపై సమీక్ష చేశారు.



సీసీఎల్‌ఏ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలను పక్కనపెట్టి జిల్లాల పునర్విభజన చేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాలు 26కు పెంచింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాను మూడు జిల్లాల్లోకి విభజించారు. ఆ సందర్భంగా ప్రజలు వివిధ రకాల అంశాలను లేవనెత్తారు. బాపట్ల జిల్లాలో కలిసిన అద్దంకి, నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల వారు తమను ప్రకాశంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. పశ్చిమప్రాంత ప్రజలు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని మొత్తుకున్నారు. ఈ రెండు అంశాలకు అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతుగా నిలవగా, అప్పటి అధికార పార్టీ అయిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా ప్రజల ఆకాంక్షలు సబబు అని భావించారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఇవేమీ పట్టించుకోకుండా తాను అనుకున్న ప్రకారం కొత్త జిల్లాల కార్యక్రమం ముగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ కందుకూరు నియోజకవర్గంలో పర్యటిస్తూ కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. పశ్చిమప్రాంతంలో పర్యటిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. అద్దంకిలో

మిగతా 6వ పేజీలో

# అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలి

- 20రోజుల క్రితం పురుగుమందు తాగిన బాధితురాలు
- ఒంగోలులో చికిత్స పొందుతూ మృతి
- కేసు నమోదు

దర్శి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దర్శి ఏడీఏ కార్యాలయంలో అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలైంది. ఆ అధికారి పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక 20రోజుల క్రితం పురుగుల మందు తాగిన ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాగా పోలీసులు ఆమె మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో టి.రమణ అనే మహిళా ఉద్యోగి అటెండర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త సుబ్బరాయుడు గతంలో వ్యవసాయాధికారిగా పనిచేశారు. ఆయన 2020లో కరోనాతో మృతిచెందడంతో కారుణ్య నియామకం కింద

మిగతా 6వ పేజీలో



# నారుమడులు నిలిచేనా?

- వరుస వర్షాలు.. ఆరని పొలాలు
- ప్రారంభంకాని పొగాకు నాట్లు
- పెరిగిపోతున్న నారు
- మరో రెండు రోజులు భారీ వర్ష సూచన
- ఆందోళనలో సాగుదారులు

6

# డీఆర్సీ సమావేశం వాయిదా

- వచ్చేనెల తొలివారంలో నిర్వహించే అవకాశం

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం వాయిదా పడింది. పలు కీలక అంశాలపై సమీక్ష కోసం ఈనెల 24న డీఆర్సీ సమావేశం ఏర్పాటుకు ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. వారు సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో డీఆర్సీ సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం పంపారు. అయితే బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వారంరోజులపాటు ఇవి కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇదే సమయంలో కార్తీక మాసం కావడంతో వివాహాలు, శుభకార్యాలు అధికంగా ఉన్నాయి. ఒక్కో ఎమ్మెల్యే రోజుకు ఇలాంటి ఐదారు కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 24న జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేసి మరోసారి నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా సమావేశాన్ని వాయిదా వేయాలని ఇన్‌చార్జి మంత్రి అధికారులకు సూచించినట్లు సమాచారం. తిరిగి వచ్చే నెల తొలివారంలో డీఆర్సీ సమావేశం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# ఊరించే.. ఉసిరి

- తక్కువ పెట్టుబడితో సాగు
- ఆదాయ వనరుతోపాటు ఆరోగ్య ప్రదాయిని

7


# ఓం నమఃశ్శివాయ..

- ప్రారంభమైన కార్తీకమాసం
- శివాలయాల్లో అభిషేకాలు, ఆకాశదీపాలు
- దేవాలయాల వద్ద బారులు తీరిన మహిళలు

7



ఒంగోలులో ఆకాశదీపాన్ని సిద్ధం చేస్తున్న అర్చకులు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న జయంత్‌బాబు

# పొగాకు సమాఖ్య పీఐసీ చైర్మన్‌గా జయంత్‌బాబు

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (పొగాకు సమాఖ్య) పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌గా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మండవ జయంత్‌బాబు నియమితులయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పొగాకు పండించే రైతులు వేలాది మంది సభ్యులుగా ఉండే పొగాకు సమాఖ్య ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక వెలుగు వెలిగింది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోయినా పొగాకు అధికంగా పండే ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది.

### నిబద్ధతకు గుర్తింపు

ఒంగోలు కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కాగా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం వచ్చాక నామినేటెడ్ పదవుల భర్తీలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈక్రమంలో రైతుల్లో గుర్తింపు ఉన్న పొగాకు సమాఖ్య పీఐసీ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీ చైర్మన్‌గా మద్దిపాడు మండలం బసవన్నపాలెంకు

మిగతా 6వ పేజీలో

# బెల్టు షాపులో బోలెడు సీసాలు!

- అల్లూరులో భారీగా మద్యం పట్టివేత
- నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎస్టీఎఫ్ విభాగం
- కొత్తపట్నం మద్యం దుకాణం నుంచి సరుకు సరఫరా

7

## మార్కాపురం జిల్లాపై ముందడుగు

(5వ పేజీ తరువాయి)

పర్యటించేటప్పుడు అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష నేత హోదాలో పశ్చిమ ప్రాంతానికి వచ్చిన చంద్రబాబునాయుడు మార్కాపురం, గిద్దలూరులలో జరిగిన సభల్లో తాము అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు, అద్దంకిలను ఒంగోలులో చేరుస్తామని స్పష్టంగా చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గిద్దలూరు వచ్చినప్పుడు జనసేన అధినేత, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది అనంతరం ఆ విషయంపై దృష్టిపెట్టి జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. ఆ ఉపసంఘం వివిధ రూపాల్లో సమాచారం సేకరించి ఒక నివేదికను రూపొందించింది. అందులో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సంబంధించి మార్కాపురం కేంద్రంగా ఆ జిల్లా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటు అద్దంకి అటు కందుకూరులను ప్రకాశం జిల్లాలో కలపాలని కూడా సూచించారు.

**కీలక దశ ఆరంభం**

కాగా రాజకీయ హామీలు, మంత్రివర్గ ఉపసంఘాలు ఎన్ని నివేదికలు ఇచ్చినా చట్టప్రకారం పని పూర్తిచేయాల్సింది అధికార యంత్రాంగమే. అది ఎప్పుడు జరుగుతుందో అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. ఈ దశలో బుధవారం నాటి పరిణామం ఈ వ్యవహారం తుది దశకు చేరిన సంకేతాన్ని వెల్లడించింది. సీసీఎల్ఏ కమిషనర్ లక్ష్మీ, అదనపు కమిషనర్ మురళీ నిర్వహించిన వీసీలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లను ప్రస్తావిస్తూ జిల్లాల పునర్వ్యస్థీకరణ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారని కలెక్టర్లకు తెలిపారు. ఆ సందర్భంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రస్తావించారు. మార్కాపురంతోపాటు గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాలను ఆ జిల్లాలో భాగస్వామ్యం చేయాలన్న ఆలోచనను తెలిపారు. తదనుగుణంగా మండలాలు, గ్రామాల వారి పరిస్థితిని సమీక్షించింది. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోండి. తదనుగుణంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ, భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారు. అది రెండు, మూడు రోజుల్లోనే అందాలని ప్రత్యేకంగా ఆదేశించటం విశేషం. అద్దంకి, కందుకూరులను ప్రకాశం జిల్లాలోకి కలపాల్సిన అవసరం ఉందని ఆ రెండు నియోజకవర్గాలు, గ్రామాలు, మండలాల వారి హద్దులు భౌగోళిక సరిహద్దులు గుర్తించి వెంటనే నివేదిక పంపాలని బాపట్ల, నెల్లూరు జిల్లాల కలెక్టర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు.

**ఎప్పుడైనా జరగవచ్చు**

కాగా ఉన్నతాధికారుల ఆదేశాలను పరిశీలించినా, మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నా వచ్చే జనవరికే జిల్లాల పునర్వ్యస్థీకరణ అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే నివేదికలు సిద్ధం చేసింది. వివిధ రకాల సాంకేతిక సమస్యలతో ఈ విషయంలో ప్రభుత్వం వేగంగా స్పందించనుందనే ప్రచారం ఉండనే ఉంది. దీంతో ఈ విషయంపై మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రిని సంప్రదించగా మా పని పూర్తయింది.. ఇప్పుడు యంత్రాంగం పని ప్రారంభమవుతుంది.. వచ్చే జనవరికే కొత్త జిల్లాల ఏర్పాటు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.. కానిపక్షంలో వచ్చే ఏడాదిలో ఎప్పుడైనా పూర్తవుతుందని తెలిపారు.

## ముసురుపట్టి.. ముంచెత్తి..!

(5వ పేజీ తరువాయి)

106.0, సీఎస్‌పురంలో 95.3, వెలిగండ్లలో 92.0, పామూరులో 86.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పశ్చిమప్రాంతంలోని కొన్ని మండలాలు మినహా అత్యధిక ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ప్రత్యేకించి జిల్లా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు, కనిగిరి నియోజకవర్గాల్లో విస్తారంగా పడ్డాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. నాగులుప్పలపాడు మండలం కొత్తకోట వాగు, ఒంగోలు-మంగమూరు మధ్య నల్లవాగు, పామూరు మండలంలోని దుప్పలి వాగులు పొంగి ఆ మార్గాల్లో రాకపోకలు నిలిచాయి. పలు ఇతరచోట్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఒంగోలులో తెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు అవస్థ పడ్డారు. నగరంలోని ప్రధాన వీధుల్లో చెరువులను తలపించేలా నీరు పారగా శివారు కాలనీలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లోనూ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడం, ముసురు వానతో రోడ్లు ఛిద్రమై గ్రామీణ ప్రజలు అవస్థలు పడ్డారు.

**రైతుల్లో ఆందోళన**

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని పశ్చిమప్రాంతంలో విస్తారంగా పంటలు సాగు చేశారు. ప్రధానంగా పత్తి, మిర్చి, వరి, కంది, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలు వేయగా వాటిలో వరి మినహా అన్నీ పంట దశకు వచ్చాయి. వాటికి తాజా వర్షం ప్రతికూలంగా మారింది. సుమారు 33వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మిర్చి జిల్లాలో సాగు కాగా అందులో దాదాపు 90 శాతం పశ్చిమప్రాంతంలోనే వేశారు. ప్రస్తుత వర్షాలకు చాలాచోట్ల పొలాల్లో నీరు చేరి మొక్కలు ఉరకెత్తిపోయే పరిస్థితి కనిపిస్తోంది. పత్తి పంట సుమారు 45వేల ఎకరాల్లో సాగు చేయగా అది కూడా అత్యధికంగా ఆ ప్రాంతంలోనే ఉంది. ప్రస్తుతం పత్తి పంట కాయ, తీతల దశలో ఉండగా వర్షాలతో కాయలు కుళ్లిపోయే అవకాశం ఉంది. పత్తి తడిచి పనికిరాకుండా పోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. సజ్జ పంట కోత దశకు రాగా వర్షాలతో తేమ అధికమై కంకులు బూజుపట్టి చేతికి అందకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది కూడా ఏపుగా పెరిగే సమయం కాగా తాజా వర్షాలతో మరింతగా మొక్కలు పెరిగి కాపు రాకుండా పోతుందని చెప్తున్నారు. ప్రస్తుత వాతావరణంతో అన్నిరకాల పంటల్లోనూ తెగుళ్లు, కలుపు అధికం కానున్నాయి. పశ్చిమప్రాంతంలో వ్యవసాయశాఖ అధికారులు పొలాల్లో తిరిగి పంటలను పరిశీలించి రైతులకు జాగ్రత్త చర్యలపై సూచనలు ఇస్తున్నారు.

**అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం**

ఇప్పటికే జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండటమే కాక బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి తీవ్రప్రభావం చూపుతుందన్న సంకేతాలతో జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమయ్యారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలోనే ఉండి కలెక్టర్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ ఇతర శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తూ తగు సూచనలు చేశారు. గత రాత్రి అందరూ అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ రాజాబాబు బుధవారం సింగరాయకొండ మండలంలో పర్యటించారు. ఒంగోలులో మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, అర్బన్ తహసీల్దార్ మధుసూదన్‌లు శివారు కాలనీల్లో పర్యటించి ఉపశమన చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే జనార్దన్ జూమ్ మీటింగ్ నిర్వహించి కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో మాట్లాడి అప్రమత్తం చేశారు.

**శిబిరాల ఏర్పాటుపై దృష్టి**

వర్షం అధికమైతే లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా శిబిరాలు ఏర్పాటుపై కూడా అధికారులు దృష్టి సారించారు. అధికారుల సూచనలతో తీరప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ముందు జాగ్రత్తగా వలలు, పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. జేసీ గోపాలకృష్ణ ఒంగోలు రూరల్ మండలం ముదిగొండి వాగు ఉధృతిని పరిశీలించారు. జిల్లాలో వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఇదిలాఉండగా బుధవారం పగటిపూట వర్షం ఎక్కువగా పడటంతో ఒంగోలు నగరంతోపాటు తీరప్రాంతం అలాగే ఒంగోలు పరిసర ప్రాంతాల్లో పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు.



# పొంగుతున్న వాగులు

● రాకపోకలకు అంతరాయం ● పలుచోట్ల పహారా ఏర్పాటు

నాగులుప్పలపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో మండలంలో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులకు వరదనీరు చేరుతోంది. ముఖ్యంగా నాగులుప్పలపాడు- తిమ్మనపాలెం రహదారిలోని కొత్తకోట వాగుకు ఉప్పొంగడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి ఆ దారిలో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎన్నో ఏళ్ల నుంచి కొత్తకోట వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా కార్యరూపం దాల్చడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ మార్గంలోనే హనుమాపురం వాగు పొంగి ప్రవహించిన సమయంలో కూడా రాకపోకలు నిలిచిపోయాయి. హనుమాపురం గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు.

**ఉధృతంగా నల్లవాగు**

**సంతనూతలపాడు:** గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగమూరు సమీపంలోని నల్లవాగు పొంగి ప్రవహిస్తోంది. ఈక్రమంలో బుధవారం ఒంగోలు, మంగమూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు కొంత ఇబ్బందిపడ్డారు. వాగు వద్ద ముందు జాగ్రత్తగా ఎస్‌ఐ వి.అజయ్‌బాబు పర్యవేక్షణలో ఓ కానిస్టేబుల్‌తో గస్తీ ఏర్పాటు చేశారు.

**చప్టాపై వరదను పరిశీలించిన జేసీ**

ఒంగోలు(రూరల్): గుత్తికొండవారిపాలెం వద్ద గల కొప్పోలు-కరవది రోడ్డులో ముదిగొండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడిపై చప్టాపై వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో బుధవారం సాయంత్రం జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులో వరద ఉధృతి అధికంగా ఉన్నందున చప్టాపై వాహనాదారులు ప్రయాణించవద్దని సూచించారు. రాకపోకలు సాగించకుండా ముందు జాగ్రత్తగా ముళ్లకంపను రోడ్డుకు అడ్డంగా పరిచారు. పోలీస్‌లను కాపలాను ఉంచారు.

**కొత్తమామిడిపాలెం చప్టాపై..**

ఒంగోలు నుంచి కొత్తమామిడిపాలెం వెళ్లే రోడ్డులోని చప్టాపై వర్షపు నీరు భారీగా ప్రవస్తోంది. దీంతో గ్రామ ప్రజలు ఎటూ ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామం నగర పరిధిలో ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని, చప్టాపై హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



కొత్తకోట వాగుకు చేరిన వరదనీరు

## చేను ఆరదు.. సేద్యం సాగదు

● అధిక వర్షాలతో అనర్థాలు ● పత్తి రైతులకు ఇబ్బందులు ● కలుపు నివారణకు ఆటంకాలు

త్రిపురాంతకం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలు, తుఫాన్‌లు, రుతుపవనాల కారణంగా ఈ ఏడాది కురుస్తున్న వర్షాలు ఇప్పటివరకు కొంత ఊరటనిచ్చినా మళ్లీ మొదలైన వర్షాలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో ఎక్కువగా పత్తి రైతులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మొత్తం ఐదు మండలాల పరిధిలో దాదాపు 12వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా అందులో పెద్దారవీడు, దోర్నాల పరిధిలోనే 6వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. ప్రస్తుతం అక్కడ అధికంగా కురుస్తున్న వర్షాలతో పత్తికి నష్టం జరిగే పరిస్థితి నెలకొంది. పత్తి పగిలి పొలాల్లో ఉన్నచోట చెట్లపై నుంచి కారిపోతూ ఉండగా తీసి ఇళ్లలో నిల్వ ఉన్న పత్తి కూడా తడిసి రంగుమారుతుందని వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు పొలాల్లో పత్తి నల్లగా మారుతుండగా చెట్లకు ఉన్న కాయలు కూడా రంగుమారి ఎర్రగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మిర్చిని వేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్న రైతులకు వాతావరణం కాస్త అనుకూలంగా కనిపించడంతో మిర్చి సాగు కూడా చాలావరకు చేసినప్పటికీ ఆలస్యంగా మిర్చి నారు నాటడంతో ఇప్పుడు వర్షాలతో మిర్చికి నష్టం కనిపించడం లేదు. కాకపోతే మిర్చిలో అంతరసేద్యం చేయడానికి తడి ఆరక పోవడంతో కలుపు మొక్కలు పెరిగి తెగుళ్లు, పురుగులు పెరిగిపోయే ప్రమాదం ఉంది. వర్షాల కారణంగా చేను ఆరడం లేదు. సేద్యం సాగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యాన పంటల్లో ప్రధానంగా బొప్పాయి రైతుకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. అధిక వర్షాలతో తేమశాతం పెరిగిపోవడంతోపాటు కొన్ని భూముల్లో నీరు నిల్వ ఉంటున్న కారణంగా బొప్పాయి వైరస్ బారిన పడే అవకాశం ఉందంటున్నారు. నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది సాధారణ సాగుకు మించి మొత్తం 2800 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. నీరు నిలిచిన పొలాల్లో బొప్పాయి ఆకులు పచ్చగా మారిపోయాయి. వర్షాలు ఇంకా పడితే పంటకు నష్టమని రైతులు చెప్తున్నారు. మొత్తానికి ఈ వర్షాలు రైతులకు కొంత ఊరట.. కొంత ఆందోళన కలిగిస్తున్నాయి.



రంగుమారుతున్న పత్తి కాయలు



కందిలో సేద్యం చేయక పెరుగుతున్న గడ్డి

## నారుమడులు నిలిచేనా?

● ఆరని పొలాలు ● ప్రారంభంకాని పొగాకు నాట్లు
● కొనసాగుతున్న వర్షాలు ● ఆందోళనలో సాగుదారులు

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో పొగాకు నారుమడులు పెట్టిన రైతులు వరుస వర్షాలతో వణికిపోతున్నారు. రెండు నెలల క్రితం విత్తనాలు పోసిన మడుల్లో ఇప్పటికే నారు పీకే సమయం దాటిపోతోంది. దాదాపు పక్షం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పొలాలు ఆరకపోవడంతో రైతులు పొగాకు నాట్ల జోలికి వెళ్లలేదు. తాజాగా వాయుగుండం ప్రభావంతో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో నారుమడులు సాగు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. కొండపి, జరుగుమల్లి మండలాల్లో మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. ఈ రెండు మండలాల్లో దాదాపు 500 ఎకరాల్లో రైతులు పొగాకు నారు మడులు పెట్టారు. ఇందులో సగానికిపైగా ముదురువి ఉన్నాయి. సాధారణంగా ఈ సమయానికి ఎర్రనేలల్లో పొగాకు నాట్లు పూర్తవుతాయి. నల్లరేగడి నేలల్లో నాట్లు ముమ్మరంగా సాగుతాయి. అయితే ఇప్పటి వరకు కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి మండలాల్లో పట్టుమని పది ఎకరాల్లో కూడా పొగాకు నాట్లు పడలేదు. ముదురు నారు పెరిగిపోతుండటంతో ఆకులు కోసి వేస్తున్నారు. లేతనారు మడులు కూడా తాజా వర్షాలతో తెగుళ్లు, చీడపీడల బారినపడి దెబ్బతినే ప్రమాదం ఉందని రూ.లక్షల పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఆగిపోయి ఎండ వస్తే నారుమడుల పరిస్థితి తెలుస్తుందని వారు అంటున్నారు. వర్షాలు పూర్తిగా తెరిపిచ్చిన తర్వాత పొలాలు ఆరి నాట్లు వేసేందుకు ఇంకో వారం పడుతుందని రైతులు చెప్తున్నారు. తాజా పరిస్థితితో నారు చేతికి వస్తుందా? లేదా? అని వారు దిగాలు చెందుతున్నారు.

## రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

బంక్ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడి
సీసీ కెమెరాలో దృశ్యాలు
పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ కీర్తి గోపీ వీరంగం సృష్టించాడు. బంకు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని 216 జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు ఉంది. బచ్చులవారిపాలేనికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గోపీ గతంలో దాదాపుగా రెండేళ్ల హైవే మొబైల్ వాహనానికి డ్రైవర్‌గా పని చేసి ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో ఎంటీ సెక్షన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున అతను మరో ఇద్దరు వ్యక్తులతో పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి రూ.50 పెట్రోల్ అప్పుగా పోయాలని సిబ్బందిని అడిగాడు. వారు నిరాకరించారు. దీంతో గోపీ వీరంగం సృష్టించాడు. ఇరువురు సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. నానా దుర్భాషలాడాడు. ఆ దృశ్యాలంతా సీసీ కెమెరాలో రికార్డు కాగా నిర్వాహకులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురైన మోటార్ సైకిల్‌ను మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా ప్రమాదానికి గురై గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు నుంచి మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్‌ను బుధవారం మరో మోటార్‌సైకిల్‌కు కట్టుకొని అద్దంకిలోని మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా శింగరకొండ రోడ్డులోప్రమాదం చోటుచేసుకుంది. ముందు వస్తున్న మోటార్ సైకిల్ సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న బైక్ ఢీ కొట్టింది. దీంతో వెనుక మోటార్‌సైకిల్ నడుపుతున్న బి.రాంబాబుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## వివాహిత ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలు నగరం సత్యనారాయణపురంలో బుధవారం సాయంత్రం జరిగింది. కొరిశపాడు మండలం యర్రబాలెంనకు చెందిన అరదల రేణుక (28) తన మేనత్త కూమార్తె అయిన షాఫియాను ప్రేమించింది. వారు ఇరువురు ఇష్టపడ్డారు. ఏడాది క్రితం షాఫియా అబ్బాయిగా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది. అనంతరం రేణుకను వివాహం చేసుకొని స్థానిక సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు ఇరువురు పాల వ్యాపారం చేస్తున్నారు. షాఫియా పాలు తీసుకొని బయటకు వెళ్ళి వచ్చే సరికి రేణుక ఇంట్లో చీరతో ఉరేసుకోగా ఆమెను కిందకు దించి ఆసుపత్రి తరలించారు. అయితే అప్పటికే రేణుక మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల వల్లే రేణుక ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని బంధువులు ఆరోపిస్తున్నారు.

## డీఎంజీకి గ్రానైట్ పరిశ్రమల యజమానుల వినతిపత్రం

మార్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గనులు, భూగర్భశాఖ సంచాలకులు చంద్రశేఖర్‌కు బుధవారం మార్టూరు గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో యజమానులు వినతిపత్రం అందజేశారు. విజయవాడ నగర పరిధిలో ఉన్న ఇబ్రహీంపట్నంలో ఉన్న గనులు, భూగర్భశాఖ కార్యాలయంలో డీఎంజీగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్న సమస్యలను చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. మైనింగ్ శ్లాబ్ సిస్టంలో సింగిల్ బ్లేడ్ మిషనుకు, మల్టీకట్టర్‌కు గతంలో నిర్ణయించిన రేట్లనే శ్లాబ్ సిస్టంలో అనుమతించాలని కోరారు. అదనంగా కావాల్సిన ముడిరాయికి గతంలో క్యూబిక్ మీటరుకు చెల్లిస్తున్న రూ.2 వేల వెయ్యి రూపాయలకు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల యజమానులు చల్లగుండ్ల కృష్ణ, ఇంటూరి అంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## నేడు కొత్తపేట పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం

కొత్తపేట(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎం రాజేష్ బాబు వెల్లడించారు. పంచాయతీలో మొత్తం 16 వార్డులు ఉండగా అందులో 5 బీసీ, ఒక ఎస్టీ, ఎస్సీ 2, జనరల్ కేటగరీలో 8 కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం 8 పురుషులు, 8 స్థానాలు మహిళలకు కేటాయించామన్నారు. ఆర్వో(రిటర్నింగ్ అధికారి)గా సుబ్బారావు, అసిస్టెంట్ ఆర్వోగా నారాయణను జిల్లా అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉంటే సమయాభావం లేకుండా హఠాత్తుగా ఎన్నికలు రావడంతో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అసాధారణంగా కనిపిస్తోంది.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంపీడీవో బి. వరూధిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ధర్మవరం, తిమ్మాయపాలెం, మణికేశ్వరం గ్రామాల్లో, 24న శంఖవరప్పాడు, తిమ్మాయపాలెం, కొంగపాడు, 25న శంఖవరప్పాడు, కొటికలపూడి, నాగులపాడు, 26న కలవకూరు, కుంకుపాడు, నాగులపాడు గ్రామాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. 27న శింగరకొండపాలెం, గోపాలపురం, వెంకటాపురం, 28న ఉప్పలపాడు, చక్రాయపాలెం, జార్లపాలెం, 29న వెంపరాల, చిన్నకొత్తపల్లి, ధేనువుకొండ, 30న బొమ్మనంపాడు, గోవాడ, ధేనువుకొండ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని తెలిపారు.

## భారీ వర్షాలకు అప్రమత్తమైన పోలీసు

● తక్షణ స్పందన కోసం ప్రత్యేక బృందాలు
● ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికలు మేరకు అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉండేవిధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న వాగులు వంకలు, నదీపరివాహక ప్రాంతాలు, చెరువులు వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. సహాయక చర్యలు అంచనా వేయడానికి అవసరమైన చోట డ్రోన్లు వినియోగానికి సిద్ధం చేశామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యసర పరిస్థితిలో సహాయం కోసం 112 లేదా పోలీసు వాట్సప్ నంబర్ 91211 02266కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## డీఆర్సీకి గుర్తింపు పొందిన పార్టీలను ఆహ్వానించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : డీఆర్సీ సమావేశాలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ముఖ్యనేతలను కూడా ఆహ్వానించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోరారు. బుధవారం కలెక్టర్ రాజాబాబును కాంగ్రెస్, సీపీఐ, ఆమ్‌ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలకు చెందిన నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరుగుతున్నందున జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ హోదాల్లోని చైర్మన్లు, అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చి అధికార పార్టీ తరుపున పోటీ చేసి ఓడిపోయిన శాసనసభ అభ్యర్థులను డీఆర్సీ సమావేశంలో కూర్చబెట్టి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం, వారికి డీఆర్సీ సమావేశాల్లో ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆయా పార్టీల నాయకులు షేక్ సైదా, శ్రీరామ్ శ్రీనివాస్, బాలబ్రహ్మం, ఇరిగినేని వెంకట నరసయ్య, సుధీర్ వర్మ, దానియేలు తదితరులు ఉన్నారు.

● కలెక్టర్ రాజాబాబును యూనిటైడె ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) నాయకులు బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## పొగాకు సమాఖ్య పీఐసీ చైర్మన్‌గా జయంత్‌బాబు

(5వ పేజీ తరువాయి)

చెందిన మండవ జయంత్‌బాబును నియమించింది. సభ్యులుగా ఎన్‌జీపాడుకు చెందిన మాచవరపు జాన్, ఒంగోలు నగరపరిధిలోని త్రోవగుంటకు చెందిన కోమటినేని వీరభద్రరావులకు అవకాశం కల్పించింది. ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా యువకుడైన జయంత్‌బాబు ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గంలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. మూడు పర్యాయాలు మద్దిపాడు టీడీపీ మండల అధ్యక్షుడుగా ఉన్న జయంత్‌బాబు పార్టీ అధికారం కోల్పోయి తీవ్రప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేశారు. బసవన్నపాలెంకు చెందిన సీనియర్ నేత మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు నుంచి రాజకీయ వారసత్వంగా వచ్చిన జయంత్‌బాబు 20ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర నేతలకు జయంత్‌బాబు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆయన భార్య అయిన రమణకు అటెండర్ ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తోంది. గతనెల 29వ తేదీన రమణ హఠాత్తుగా పురుగు మందు తాగింది. ఆ సమయంలో ఆమె ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసిందన్న విషయం తెలియలేదు. ఒంగోలులో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతిచెందడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అటెండర్ రమణను ఏడీఏ కార్యాలయంలోని ఒక అధికారి చీటికిమాటికి విసిగిస్తుండేవాడని పోలీసుల విచారణలో తేలింది. అవసరమైన సమయంలో సెలవు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టేవాడని, కనీసం స్వగ్రామమైన నరసరావుపేటకు వెళ్లేందుకు కూడా అనుమతించకపోవడంతో ఆమె మనస్తాపానికి గురైందని తేలింది. దీంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్శి ఏఎస్ఐ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# ఊరించే.. ఉసిరి

● తక్కువ పెట్టుబడితో సాగు ● ఆదాయ వనరుతోపాటు ఆరోగ్యానికి మేలు

పెరిగిన ఆరోగ్య చైతన్యంతో సహజ సిద్ధమైన ఔషధ మొక్కలకు ప్రజల్లో ఇప్పుడు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఉసిరి సాగు కూడా అభివృద్ధి చెందుతోంది. విటమిన్-సీ అధికంగా ఉండే ఉసిరికాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దాని వైద్య ప్రయోజనాలు, వాణిజ్య విలువలను గుర్తించిన రైతులు ఇప్పుడు ఉసిరి సాగుపై దృష్టి సారిస్తున్నారు. పర్యావరణానికి అనుకూలంగా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు అందించే ఈ పంట ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతికి మార్గం చూపుతోంది. పలువురు రైతులు ఉసిరి సాగు చేస్తుండగా వారికి ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఫలితంగా జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

### ఆరోగ్య ప్రదాయిని ఉసిరి

ఉసిరికాయ అనేది విటమిన్-సీ కలిగిన పండు. ఇది ఆరోగ్యానికి అనేక లాభాలు కలిగిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయని చెప్తున్నారు. రోగ నిరోధక శక్తి పెరిగి జీర్ణక్రియ మెరుగుపడేలా చేస్తుంది. కాలేయం, మూత్రపిండాల సంరక్షణ, గుండె ఆరోగ్యంగా ఉండేలా చేయడంలో ఉసిరి దోహదపడుతుంది. ఉసిరి రసం తాగడం వల్ల రక్తంలో చెడు కొలస్ట్రాల్ తగ్గి మంచి కొలస్ట్రాల్ పెరుగుతుంది. జ్ఞాపకశక్తిని మెరుగుపరచడం, ఇన్సులిన్ మెరుగుపడడం, షుగర్ నియంత్రణ ఇలా ఎన్నో రకాలుగా మేలు చేసే ఆరోగ్య ప్రదాయని ఉసిరి.

త్రిపురాంతకం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉసిరి సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే మక్కువ చూపుతున్నారని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఈ పంటకు ప్రధానంగా తక్కువ నీరు అవసరం కాబట్టి ఎక్కువగా మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లో సాగు చేస్తున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలంలోని ప్రాంతాల్లోని రైతులు అక్కడక్కడ ఉసిరి సాగుకు ఆసక్తి చూపారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచే ప్రత్యామ్నాయ ఉద్యానపంటగా రైతులు చెప్పుకుంటున్నారు. ఉదాహరణకు పుల్లలచెరువు వంటి మెట్ట ప్రాంతంలో నీటి వనరులు లేని చోట ఎస్.నరసింహరాజు అనే రైతు 4 ఎకరాల్లో దాదాపు 500 మొక్కలు నాటి ఇప్పటికి ఎనిమిదేళ్లుగా దాని ఫలాలను పొందుతున్నారు. ఈ పొలంలో కనిపిస్తున్న చెట్లను చూస్తే కాయలు విరగకాసి కనిపిస్తున్నాయి. ఎన్ఏ7, కాంచి, కృష్ణ రకాల మొక్కలు తెచ్చి క్రాసింగ్ చేసి పండిస్తున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది మరో 7 ఎకరాల్లో కూడా ఉసిరి సాగు చేస్తానని చెప్పారు. ప్రతి ఏటా దిగుబడి పెరుగుతూ ఎటువంటి పెట్టుబడులు లేకుండానే అంటే ఎరువులు, పురుగుమందులు వంటి వాటిని ఎక్కువగా ఆశించకుండా చెట్లకు కాయలు అధికంగా వస్తున్నాయన్నారు. స్థానిక మార్కెట్లతో పాటు ఎక్కువ దిగుబడి వచ్చినప్పుడు ఔషధ పరిశ్రమలకు కూడా ఉసిరిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా సగటున హెక్టారుకు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తూ సరైన నిర్వహణతో సాగు చేస్తే ఖర్చులన్నీ పోగా ఏటా హెక్టారుకు రూ.80వేల నుంచి రూ.లక్ష ఆదాయం వస్తున్నట్లు వివరించారు. ఒక్కసారి ఈ మొక్కలు స్థిరపడి కాయడం మొదలు పెడితే దాదాపు 30 ఏళ్లపాటు దిగుబడి తీయవచ్చని రైతు తెలిపారు.

### లాభాలు తెచ్చే ఉద్యాన పంటల్లో ఉసిరి ఉత్తమం



ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఉసిరిని ఎంచుకోవడం ఉత్తమం. తక్కువ పెట్టుబడి పైగా మెట్ట ప్రాంతాల్లో తక్కువ నీటితో ఎక్కువ ఫలాలు ఇచ్చే ఉసిరి వల్ల రైతుకు లాభాలే. వ్యవసాయంపై మక్కువతో నేను అన్ని రకాల పండ్ల మొక్కలు నా పొలంలో సాగు చేస్తున్నాను. కానీ మన నుంచి తక్కువ పెట్టుబడి ఆశించి మనకు ఎక్కువ లాభాలు ఇచ్చే పంట ఉసిరి. ఒక్కసారి మొక్క బతికితే ఏళ్ల తరబడి దాని ఫల సాయాన్ని పొందవచ్చు.

- సీ నరసింహరాజు, పుల్లలచెరువు, రైతు

## గ్రానైట్ పరిశ్రమ సమస్యలను పరిష్కరించండి

● ఏడీఎంజీకి ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ వినతి

చీమకుర్తి, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని గనుల శాఖ అదనపు సంచాలకులు చంద్రశేఖర్‌ని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీనరేజి వసూలు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థతో మూడు దఫాలుగా జరిగిన చర్చలు సంస్థ మొండివైఖరితో విఫలమయ్యాయని తెలిపారు. సమ్మెకు దారితీసిన పరిస్థితులను వివరించారు. మరోసారి సమ్మెకు వెళ్లే పరిస్థితులను కల్పించకుండా వెంటనే సంస్థతో చర్చించి సమస్యకు పరిష్కార మార్గం చూపాలని కోరారు. వీరి వినతిపై ఏడీఎంజీ చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించటం పట్ల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సూదనగుంట కోటేశ్వరరావు, కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీను, మలినేని వెంకటేశ్వర్లు, సురేష్, ప్రసాద్, కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 250.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 260.00 |

## నిండిన గుండ్లకమ్మ ప్రాజెక్టు

మద్దిపాడు, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్టుకు బుధవారం భారీగా వరద నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. వర్షాలకు ముందు 2.4 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అయితే గడిచిన మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు చేరటంతో ప్రస్తుతం 3.2 టీఎంసీలకు చేరింది. వరద నీరు ప్రాజెక్టులోకి చేరే కొద్దీ గేట్లు ఎత్తి బయటకు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు.

## రేపటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమిలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు అండర్-13 రాష్ట్రస్థాయి బాల, బాలికల క్వాలిఫైయింగ్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.విజయకృష్ణ తెలిపారు. మెయిన్ డ్రా పోటీలు ఈనెల 25 నుంచి జరుగుతాయని వారు వివరించారు. ఇతర వివరాలకు 93982 60109 నంబరును సంప్రదించాలన్నారు.

## నిరంతరం పర్యవేక్షించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాల నేపథ్యంలో పర్యవేక్షించేందుకు జిల్లా అధికారులను కలెక్టర్ రాజాబాబు నియమించారు. బుధవారం హోంశాఖ మంత్రి అనిత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాజాబాబు పలు శాఖల అధికారులు, జేసీ గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. వర్షాలకు కూలిపోయే అవకాశం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను గుర్తించి పిల్లలకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఓబులేషుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

## తీరప్రాంత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

కొత్తపట్నం, అ క్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ రాజాబాబు బుధవారం మండలంలోని ఈతముక్కల పల్లెపాలెం, కొత్తపట్నం పల్లెపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయన స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. బుధవారం రాత్రి వర్షం అధికంగా కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా మత్స్యకార గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వర్షంతో పాటు 40 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులు ఇచ్చే సూచనలు మత్స్యకారులు పాటించాలని ఆయన కోరారు. పల్లెపాలెం గ్రామంలో సముద్రం ముందుకు రావటాన్ని ఆయన పరిశీలించారు. మత్స్యకారులు ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. స్థానిక రెవెన్యూ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు, కొత్తపట్నం తాహసీల్దార్ శాంతి ఉన్నారు.

## జిల్లాలో 26.9 మి.మీ. వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బుధవారం ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో 26.9 మి.మీ.వర్షపాతం నమోదైంది. కొత్తపట్నం 78.2, సింగరాయకొండ 75.6, ఒంగోలు రూరల్ 60.6, ఒంగోలు అర్బన్ 60.6, వెలిగండ్ల 50.2, పామూరు 37.8, కొనకనమిట్ల 36.0, సంతనూతలపాడు 35.8, త్రిపురాంతకం 29.6, పీసీపల్లి 33.4,జరుగుమల్లి 32.8, కొడపి 32.6, కొమరోలు 26.2, అర్ధవీడు 25.4, తర్లుబాడు 25.2, గిద్దలూరు 25.2, పెద్దారవీడు 24.8 మీ.మీ. వర్ష పాతం నమోదైంది. దొనకొండ 23.4, దొనకొండ 23.4, కంభం 22.4, టంగుటూరు 20.0, రాచర్ల 18.2, దోర్నాల 16.8, ఎన్‌జిపాడు 16.8, కురిచేడు 16.0, మర్రిపూడి 15.8, వైపాలెం 14.4, మార్కాపురం 13.8, మార్కాపురం 13.8, మద్దిపాడు 12.6, హనుమంతునిపాడు 11.6, బేస్తవారిపేట 11.6, దర్శి 10.0, కనిగిరి 10.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## ఇంటి స్థలం మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ పథకంలో భాగంగా పేదలకు సొంత ఇంటి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నందున జిల్లాలో అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం జారీ చేసిన 23 జీవో ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పు ఇంటి స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు. సొంత ఇంటి స్థలం లేని పేదలు గ్రామ/ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మహిళల పేరుతో ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగతంగా ఇంటి పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వ స్థలం అందుబాటులో లేని పక్షంలో టిట్కో/పురపాలకసంఘం/ ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల కింద ఇళ్ళు నిర్మించి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన పేదలందరూ ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలని గోపాలకృష్ణ కోరారు.

# ఓం నమఃశ్శివాయ

● ప్రారంభమైన కార్తీకమాసం ● పలు శివాలయాల్లో అభిషేకాలు, ఆకాశదీపాలు ● దీపాలు వెలిగించేందుకు దేవాలయాలకు మహిళలు




కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం బుధవారం ప్రారంభమైంది. దీంతో జిల్లావ్యాప్తంగా పలు శివాలయాలలో బుధవారం తెల్లవారుజాము నుంచి పరమేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలు ప్రారంభమైనాయి. పరమేశ్వరుని ఆరాధనకు కార్తీకమాసం నెలరోజులు ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు. దీనితో ఈ నెలరోజులు భక్తులు ముఖ్యంగా మహిళలు ఎక్కువగా తమ దగ్గరలోని శివాలయానికి వచ్చి ఉదయం, సాయంత్రం దీపాలను వెలిగిస్తారు. బుధవారం ఉదయం, సాయంత్రం సైతం ఒంగోలు నగరంలోని పలు శివాలయాలకు మహిళలు తరలివచ్చి దీపారాధనలు చేశారు. అయితే నగరంలో బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా శివాలయాలకు వచ్చే మహిళల సంఖ్య కొంత తగ్గిందని చెప్పొచ్చు. నగరంలోని కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్యరోడ్డు పంచముఖ శివాయలం, మంగమూరు రోడ్డు అయ్యప్పస్వామి దేవస్థానం, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, లాయర్‌పేట, సంతపేటలలో ఉన్న సాయిబాబా మందిరాలు ఇలా పలు దేవాలయాలలో బుధవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించగా మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. కార్తీకమాసం ప్రారంభ సంకేతంగా స్థానిక కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి దేవస్థాన అర్చకులు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. కార్తీకమాసం నెలరోజులు ఈ ఆకాశదీపం వెలుగుతూ ఉంటుంది.

**నేడు భగినీ హస్త భోజనం**

కార్తీకమాసంలో అనేక విశిష్టమైన రోజులు ఉన్నాయి. ఇందులో మొదటిది శుక్లపక్ష విదియ. ఈ విదియ రోజును భగినీ హస్త భోజన పర్వదినంగా భావిస్తారు. అంటే ఇది రాఖీపండుగ మాదిరి సోదర సోదరీమణుల పండుగ అని చెప్పొచ్చు. ఈ భగినీ హస్త భోజనం రోజు మహిళలు వారి అన్న లేక తమ్ముడిని ఇంటికి పిలిచి వారికి తమ శక్తికొద్దీ భోజనం పెడతారు. ఇక తమ అక్క లేదా చెల్లెలుకు ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని సోదరుడు భరోసా ఇస్తారు. ఇక మహిళలు తమ సోదరుడి తిలకం దిద్ది, హారతి ఇచ్చి స్వీట్లు తినిపిస్తారు. ఇలా చేయటం వల్ల అపమృత్యు భయం తొలిగిపోతుందని నమ్మకం. ఇలా జరుపుకోవటం ద్వారా కుటుంబ బంధాలు సైతం మరింత గట్టిపడతాయనేది ఇందులోని అంతరార్థంగా చెప్పొచ్చు. ఈ కార్తీకమాస శుక్లపక్ష విదియ రోజునే యమధర్మరాజు తమ సోదరి అయిన యమున ఇంటికి భోజనానికి వెళ్లాడని ఆయన భోజనం చేసిన తర్వాత యమున ఆయనను ఒక వరం కోరిందని పురాణాలు చెబుతాయి. అక్కాచెల్లెలు చేతితో భోజనం చేసిన వారిని అపమృత్యు బారిన పడకుండా కాపాడమని ఆమె వరం కోరుకోగా అందుకు యమధర్మరాజు కార్తీకమాస శుక్లపక్ష విదియ రోజున ఎవరైతే తమ సోదరి ఇంట భోజనం చేస్తారో వారికి అపమృత్యు భయం ఉండదని, ఆ సోదరి సైతం సంపూర్ణ సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందని యమధర్మరాజు వరం ఇచ్చాడట. ఆ ప్రకారం ప్రతి సంవత్సరం కార్తీక శుక్ల విదియని భగినీ హస్తభోజన పర్వదినంగా పురణాలు చెబుతున్నాయి.

# అల్లూరులో బెల్టు దుకాణం

● రూ.లక్షన్నర విలువైన మద్యం పట్టివేత, నిర్వాహకుడు అరెస్టు ● కొత్తపట్నం మద్యం దుకాణం నుంచి సరుకు దిగుమతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణంపై స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. కొత్తపట్నం మండలం అల్లూరులో బెల్టుషాపు నిర్వహిస్తుండగా రాష్ట్ర ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో బుధవారం మధ్యాహ్నం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ విభాగం ఆధ్వర్యంలో దాడి చేశారు. 134 బీరు సీసాలు, 18 సీసాల మద్యం, 542 క్వార్టర్ సీసాలు, 90 ఎంఎల్ 18 సీసాలు సీజ్ చేసినట్టు సమాచారం. బెల్టుషాపు నిర్వాహకుడు నడారి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ మద్యం మొత్తం కొత్తపట్నం మద్యం దుకాణం నుంచి అల్లూరు బెల్టు షాపునకు సరఫరా అయినట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్‌టీఎఫ్ అధికారులు బెల్ట్ దుకాణంలో స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు బెల్ట్‌షాపు నిర్వహకుడిని ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి విచారణ ఒంగోలు ఎక్సైజ్ పోలీసులు చేయనున్నారు.

**బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు : ఎక్సైజ్ ఈఎస్**

మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి యస్.అయేషాబేగం తెలిపారు. ఈఏడాది జనవరి నుంచి అక్టోబర్ 21 వరకు జిల్లాలో 479 బెల్టుషాపులపై కేసులు నమోదు చేసి 485 మందిని అరెస్టు చేశామని అన్నారు. 1230 లీటర్లు మద్యం, 48 లీటర్లు బీర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్టోబరులో 33 కేసులు నమోదు చేసి 33 మందిని అరెస్టు చేశామని అన్నారు. మొత్తం 53.84 లీటర్లు మద్యం, 9.1 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే మద్యం దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పునరావాస ప్యాకేజీ అమలులో లోపాలు లేకుండా చూడాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు పునరావాస, పునర్నిర్మాణ(ఆర్అండ్ఆర్) ప్యాకేజీ అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల పనులు, నిర్వాసితులకు పునరావాసం ప్యాకేజీపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ పనుల పురోగతిని ప్రాజెక్టుల ఎస్ఈ అబూత్ అలీ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 11 గ్రామాలకు గాను రెండు గ్రామాల్లో పునరావాస ప్యాకేజీ లబ్ధిదారులను నిర్ధారించాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగాలన్నది ప్రభుత్వ విధానమన్నారు. నిర్వాసితుల వద్ద ఎలాంటి డాక్యుమెంట్లు ఉన్నాయో, లబ్దిదారులుగా గుర్తించేందుకు ఇలాంటివి అవసరమో వారికి తెలియజేయడంతో పాటు ఈ మొత్తం ప్రక్రియను బహిరంగంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, సొరంగాల పనులకు, పునరావాస ప్యాకేజీకి అవసరమైన నిధులపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసే క్రమంలో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తన దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, సత్యనారాయణ, డీఈఈలు, ఏఈఈలు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు ఉన్నారు.

## సర్వీసులో ఉన్న వారందరికీ శంకరన్ స్ఫూర్తి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారందరికీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ స్ఫూర్తిగా నిలిచారని కలెక్టర్ రాజాబాబు అన్నారు. శంకరన్ జయంతిని పురష్కరించుకొని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శంకరన్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ రాజాబాబు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఐఏఎస్ అధికారిగా నియమితులై ఉత్తమ అడ్మినిస్ట్రేటర్‌గా, బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ మానవతావాదిగా నిలిచారని కొనియాడారు. ఐఏఎస్ పదవికే వన్నె తెచ్చిన శంకరన్, ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారందరికీ మార్గదర్శకంగా నిలిచారన్నారు. శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకొని పనితీరును మెరుగుపర్చుకొని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఒబులేషు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా, విపత్తుల నిర్వహణ శాఖ డీపీఎం మాధురి, కలెక్టరేట్ ఏవో రవి తదితరులు ఉన్నారు.


భాగ్యనగర్ 4వ లైనులో నిలిచిన వర్షపు నీరు


జలదిగ్బంధంలో డ్వామా కార్యాలయం


లాయర్‌పేటలో జోరుగా కురుస్తున్న వర్షం


గుంటూరురోడ్డులో..

# రోజంతా ముసురు !

**కుండపోత వానతో రోడ్లు జలమయం ● వాయుగుండం ప్రభావంతో తడిసి ముద్దయిన నగరం**
**పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తం ● మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటన**
**కార్పొరేషన్, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో సహాయక చర్యలు**

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో ఒంగోలు నగరం చెరు వైంది. వీధులన్నీ జలమయం అయ్యాయి. పట్టపగలు కారు మబ్బులతో చీకట్లు కమ్ముకున్నాయి. వీడని ముసురు, వదలని వానతో నగరం తడిసి ముద్దయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి బుధవారం నగరం అస్త్య వస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలు బురదమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి రాకపో కలకు ఇబ్బందిగా మారింది. మరో వైపు కాలువల్లో పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో మురుగునీరు తోడు వర్షపు నీరు కలిసి రోడ్లపైకి ప్రవ హించాయి. అంతేగాకుండా ఏకధా టిగా కురుస్తున్న జల్లుల వానకు భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇదిలా ఉండగా స్థానిక కర్నూలు రోడ్డు నుంచి మంగమూరు వెళ్ళే రోడ్డు మార్గం మరింత అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ గోతులమయం కాగా, వర్షపు నీరు నిలవడంతో కనీసం కాలి నడక కూడా కష్టతరంగా మారింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి జటిలమైంది. స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్యనగర్, మస్తాన్ దర్గా సెంటర్, ప్రాంతాలలో నీరు నిలవడంతో నగరవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల కు బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లా విద్యాశాఖ సెలవు ప్రకటించింది. మరోవైపు కార్పొరేషన్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, క్విక్ రిస్క్ టీమ్‌ను అందుబాటులో ఉంచారు.

**కాలువల్లా మారిన ప్రధాన రహదారులు**

రోజంతా కురిసిన కుండపోత వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ళ లోతున నీరు నిలిచి చెరువులను తలపించాయి. అంతేగాకుండా ఏకధాటిగా కురిసిన వర్షానికి జీజీహెచ్ ఎదురు, కర్నూలు రోడ్, పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శివారు కాలనీలలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కాగా ఈ వానకు రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు చేపట్టే చిరువ్యాపారులకు కష్టాలు తప్పలేదు. దీంతో మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనరు వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎంఈ ఏసయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, ఎన్.పిచ్చయ్య తదితరులు శివారు కాలనీల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.


వంటవారికాలనీలో వర్షపునీటి ప్రవాహం

**సహాయక చర్యలు వేగవంతం**
**- కె.వెంకటేశ్వరరావు, నగర కమిషనర్**

తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నగరంలోని ప్రజలు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా మెయిన్ డ్రైయిన్‌లలో పూడిక తీత పనులు, చెట్లు తొలగింపు చర్యలు చేపట్టాం. అలాగే శివారుకాలనీల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. కార్పొరేషన్ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు, క్విక్ రెస్పాన్స్ టీమును నియమించాం. 24గంటలు అందుబాటులో ఉండాలని కార్పొరేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించాం. ఎక్కడా కూడా తుఫాను విపత్తు కారణంగా ప్రజలు ఇబ్బంది పడకూడదని నిరంతరం పర్యవేక్షిస్తూ అంటువ్యాధులు విజృంభించకుండా బ్లీచింగ్, ఆయిల్ స్ప్రే వంటివి చల్లించడం చేయిస్తున్నాం.


బాలాజీరావుపేటలో మోకాలిలోతులో ప్రవహిస్తున్న వర్షపునీరు


మదర్‌థెరిస్సా కాలనీలో ఎక్స్‌కవేటర్‌లో వర్షపునీటిని మళ్లిస్తున్న కమిషనర్, మేయర్

## వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి

● ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం నేపథ్యంలో అధికారులు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఆయన కార్పొరేషన్ అధికారులు, టీడీపీ శ్రేణులతో జూమ్ సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్ర హెచ్చరికలతో ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే పోతురాజు కాలువ సమీపంలో నివసించే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కార్పొరేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పోతురాజు కాలువ పూడికతీత పనులు ముందుగానే చేపట్టడం ద్వారా ముంపు నుంచి ఇబ్బందులు ఉండబోవని తెలిపారు. సమావేశంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, క్లస్టర్ కన్వీనర్లు, మండల పార్టీ, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి

● సీసీఎల్ఏ జయలక్ష్మి ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లా ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని భూపరిపాలన శాఖ చీఫ్ కమిషనర్(సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి ఆదేశించారు బుధవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడుతో పాటు యువగళం పాదయాత్రలోనూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్కాపురం జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలు కూడా ఇచ్చిన వినతిపత్రాలను క్రోడీకరించి జిల్లా ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని చెప్పారు. మీకోసం అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఇళ్ళ స్థలాలు లేని వారందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇచ్చేలా ప్రభుత్వం జీవో జారీ చేసినందున ఆ మేరకు స్థలాలను, అర్హులను గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ కృష్ణమోహన్, సూపరిటెండెంట్ నాగజ్యోతి, కలెక్టరేట్ ఏవో రవి పాల్గొన్నారు.

## టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా సుధాకర్


శిద్దా సుధాకర్‌ని అభినందిస్తున్న ఆర్యవైశ్యసంఘ నాయకులు

చీమకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా చీమకుర్తికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా సుధాకర్‌ని నియమించారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు ఆర్యవైశ్యసంఘ నాయకులు చీమకుర్తిలో సుధాకర్‌ని కలిసి అభినందించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పచెప్పిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొండవీటి ఏడుకొండలు, నూకల సురేంద్ర, నూకల సుబ్రహ్మణ్యం, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివం ఫౌండేషన్ చేయూత


నగదును అందజేస్తున్న శ్రీహరి, శ్రీనివాసరావు

చీమకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామతీర్థం క్యాంపుకాలనీలో నివాసం ఉంటున్న కోట బుజ్జి, ఏసమ్మ దంపతుల కుమార్తె వివాహం కోసం శివం ఫౌండేషన్ బుధవారం చేయూతనందించింది. సంస్థ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి, ఆర్ఎల్‌పురం గ్రామ టీడీపీ అధ్యక్షుడు పమిడి శ్రీనివాసరావు చేతులమీదుగా రూ.20వేల నగదును నవవధువుకు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, తిరుమల, సుధీర్, పవన్, వెంకటేష్, కాశయ్య, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్‌నర్సులు మూడు పోస్టులు, ఎఫ్ఎన్‌వో నాలుగు, స్వీపర్ ఎనిమిది పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన చేసి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ ఏవో, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై హర్షం

మద్దిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సమస్యల పట్ల సానుకూలంగా స్పందించటం హర్షణీయమని రాష్ట్ర ఎన్జీవో సంఘ నాయకుడు అడకా స్వాములు పేర్కొన్నారు. బుధవారం దొడ్డవరంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్థులకు రావాల్సిన బకాయిలు, న్యాయపరమైన డిమాండ్లు కొన్నింటిని వెంటనే, మరికొన్నింటిని దశలవారీగా పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొందన్నారు. ఉద్యోగుల డీఏను నవంబరు 1న చెల్లిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వడ్డెంపూడి శ్రీనివాసరావు, మోరబోయిన సురేష్, కుంచాల రామాంజనేయులు, విద్యాకమిటీ చైర్మన్ అడకా రాంబాబు, కుంచాల శ్రీను, జనసేన పార్టీ నాయకుడు వల్లెపు సాయి తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్లతో వ్యవసాయ పనులు సులభతరం

● ఎమ్మెల్యే బీఎన్


డ్రోన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల వినియోగంతో వ్యవసాయ పనులు మరింత సులభతరమవుతాయని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 80 శాతం రాయితీతో మంజూరైన ఐదు కిసాన్ డ్రోన్‌లను బుధవారం ఈదుమూడి గ్రామంలో జరిగిన సభలో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వ్యవసాయ పనులకు కూలీల కొరత అధికంగా ఉందని, అయితే వ్యవసాయ డ్రోన్ల ద్వారా రైతులు తమ పొలాల్లో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పురుగుమందు పిచికారి చేసుకోవచ్చన్నారు. దీనివల్ల సమయంతో పాటు ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ డ్రోన్లను ప్రభుత్వం వ్యవసాయశాఖ రాయితీతో అందిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మంజూరైన 5 డ్రోన్లకు రూ.40లక్షల రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతుసేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా సరిపడా అందించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గత ఏడాది పండిన నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ బి.రమేష్‌బాబు, ఏవో పోతినేని వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఈదుమూడి సొసైటీ చైర్మన్ కొండ్రగుంట విజయలక్ష్మి, గ్రామ అధ్యక్షుడు కుర్రా వీరాంజనేయులు, నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నందింగం కోటేశ్వరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కనగాల శ్రీనివాసరావు, పైడి నాగేశ్వరావు, కొమ్మినేని రమేష్, స్వర్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

సంతనూతలపాడు: ఎనికపాడు గ్రామంలో బుధవారం సీఎం సహాయనిధి కింద 10మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నల్లూరి వెంకట్రావు, నల్లూరి గోపి, ముండ్లమూరి ప్రసాద్, పి.సాంబశివరావు, తిరుపతిస్వామి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దు

● కలెక్టర్ రాజాబాబు సూచన
● భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం
● తీరప్రాంతమైన ఊళ్లపాలెంలో పర్యటన

సింగరాయకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లకూడదని, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఊళ్లపాలెం తీరాన్ని పరిశీలించారు. అక్కడి మత్స్యకారులు, స్థానికులతో మాట్లాడారు. వాతావరణశాఖ సమాచారం మేరకు వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్నారు. ఆ ప్రభావంతో వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు, గాలులు వీస్తాయన్నారు. ముందస్తు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని విలేజ్ క్లినిక్ సెంటర్‌ను సందర్శించారు. అత్యవసర వైద్యసేవలకు సంబంధించిన మందులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి ఉండటాన్ని చూసిన ఆయన సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం లోపు పరిసరాలను శుభ్రం చేయించి ఫొటోలు పంపాలని ఆదేశించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వర్షం ఎక్కువగా ఉంటే వెంటనే పాఠశాలలో పునరావాసకేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, జడ్పీసీఈవో చిరంజీవి, డీఆర్డీఏ పీడీ నారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు, జేడీ శ్రీనివాసరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జయమణి తదితరులు పాల్గొన్నారు.

# కొండపిలో తటాకాలను తలపిస్తున్న రోడ్లు

**వర్షాలతో రాకపోకలకు ప్రజల అవస్థలు ● మంత్రి స్వామి ఆదేశంతో రంగంలోకి ఆర్అండ్‌బీ అధికారులు**


ఆర్అండ్‌బీ రోడ్డులో మట్టి మెరకలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్


సాయిబాబా ఆలయం వద్ద నిలిచిన వర్షపునీరు

కొండపి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండపిలోని ప్రధాన రోడ్లలో భారీగా నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. ప్రభుత్వ వైద్యశాల, మండల కార్యాలయాల సముదాయం, జాళ్లపాలెం రోడ్డు, పొదిలి రోడ్డు, మద్దులూరు రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. మంగళవారం ఈ ప్రాంతాలను చూసిన మంత్రి వెంటనే రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్అండ్‌బీ సింగరాయకొండ డీఈ ఆనందరావు బుధవారం రంగంలోకి దిగారు. కొండపిలోని ప్రధాన వీధుల్లోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్‌లలోని మెరకలను ఎక్స్‌కవేటర్లతో తొలగింపచేశారు. పెరిదేపి- కొండపి గ్రామాల మధ్యన ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లలో ఎండిపోయిన చెట్లను తొలగించారు. తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

**సాయిబాబా ఆలయం ముందు..**

కొండపిలోని మద్దులూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయం ముందు భారీగా వర్షపు నీరు నిలిచింది. సైడు కాల్వలను దుకాణాల వారు పూడ్చివేయడంతోపాటు, మెరకలు తోలడంతో రోడ్డు పల్లమైంది. దీంతో వర్షపు నీరు పారుదలకు అవకాశం లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈనీటిని కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తొలగించే చర్యలు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

## పేకాడుతున్న 9 మంది అరెస్ట్

ఒంగోలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.18వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని విడిది ఫంక్షన్‌హాల్‌లో పేకాడుతున్న సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిందితులను తాలుకా పోలీసులకు అప్పగించారు.

## వర్షాలతో రాకపోకలకు అవస్థలు

ఒంగోలు(రూరల్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో గల రైల్వే ఫ్లైఓవర్ వంతెనకు తూర్పు వైపు దిగువన బుధవారం కురిసిన భారీ వర్షంతో వాహన దారులు ఇబ్బందిపడ్డారు. ఈ వరద నీటిని పోతురాజు కాలువ మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఒంగోలులో వేటపాలెం బాలుడు

● హోంకు తరలింపు

ఒంగోలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దారి తప్పిన పదేళ్ళ బాలుడిని వేటపాలెం హోంకు తరలించారు. బుధవారం ఒంగోలులోని మంగమ్మ కాలేజీ ఎదురుగా రోడ్డు డివైడర్‌పై ఒంటిపై దుస్తులు కూడా లేకుండా పదేళ్ళ బాలుడు కూర్చొని ఉన్నాడు. జోరుగా వర్షం పడటంతో చలికి వణుకుతు ఉండగా అటువైపుగా వెళుతున్న లారీ డ్రైవర్ దండేల కోటేశ్వరరావు చూశాడు. వెంటనే బాలుడి వద్దకు వెళ్ళి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తనది వేటపాలెం అని, తండ్రి పేరు పొన్నం శామ్యూలు అని చెప్పాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వగా హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ సహకారంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ఆదేశాలతో బాలుడిని వేటపాలెం హోంకు తాలుకా సీఐ విజయకృష్ణ తరలించారు.

## జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఒంగోలు విద్య, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మాంటిస్సోరి స్కూలులో ఏడో తరగతి చదువుతున్న చప్పిడి జ్ఞానేశ్వర్ జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఈపీపీఈ బాలుర ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం జ్ఞానేశ్వర్‌ను కరస్పాండెంట్ సబరీనాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్ ప్రత్యేకంగా అభినందించారు.

## రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ రోజు ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు తాళ్ళూరు మండలం సోమవరప్పాడులో పర్యటిస్తారు. సాయంత్రం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారు.

## ఇళ్ల స్థలాల దరఖాస్తుకు గడువు పెంపు

నాగులుప్పలపాడు,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు గడువును నవంబరు 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. బుధవారం నాగులుప్పలపాడులోని మండల పరిషత్‌కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నివసించే ఇళ్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందని చెప్పారు. సీఎం చంద్రబాబు చొరవతో రాష్ట్రంలో 5 లక్షల మందికి లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. అర్హులైన గ్రామీణ ప్రాంత పేదలు ఇంటి నిర్మాణాల కోసం మండల గృహనిర్మాణశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## 16 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత


ఉద్యోగ నియామకపత్రాలను అందజేసిన కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి 16 మందికి కారుణ్య కోటాలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారిలో ఆఫీసు సబార్డినేట్లు, టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు గ్రేడ్-5, గ్రేడ్-6లు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఫణికుమార్, కలెక్టరేట్ ఏవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మిరప పంటల పరిశీలన


కండ్లగుంటలో మిరపపంటను పరిశీలిస్తున్న ఏవో సంధ్య

నాగులుప్పలపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉద్యాన శాఖ అధికారి డి.సంధ్య బుధవారం పలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కండ్లగుంట, నాగులుప్పలపాడు గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటలను పరిశీలించి అధిక తేమ కారణంగా మిరప మొక్కలు పోషకాలను తీసుకోలేవని చెప్పారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు తరలించాలన్నారు. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి చుట్టూ మట్టిని ఎగదోయాలని సూచించారు. ఉరకెత్తిన మొక్కలకు 10 గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలని తెలిపారు. వడలిన మొక్కలకు లీటరు నీటిలో 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారి చేయాలన్నారు. ఇనుపధాతు లోపం కనిపిస్తే 10లీటర్ల నీటిలో 50 గ్రాముల అన్నభేదిని, ఒక నిమ్మచెక్క రసం కలిపి పిచికారి చేయాలని సూచించారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి

పొన్నలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుల్లారావు సూచించారు. అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన వివిధ శాఖల మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాల వలన ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుల సామర్థ్యం, ప్రస్తుత నీటి నిల్వను అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.సుజాత, ఎస్సై అనూక్, విద్యాశాఖ అధికారి రవిచంద్ర, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక మాస వేడుకలు ప్రారంభం


త్రిపురాంతకస్వామికి పూజలు

సంతనూతలపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం కార్తీకమాస వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు నవంబరు 21తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో నారాయణరెడ్డి, అర్చకులు బుచ్చిబాబుశర్మ ఆలయంలోని శివపార్వతులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి : ఎంపీడీవో

సంతనూతలపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. బుధవారం కొనగానివారిపాలెంలో జరుగుతున్న పారిశుధ్య పనులను, చెత్తసేకరణను ఆయన పరిశీలించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా తయారైయ్యే పరిస్థితి ఉందని, ముందు జాగ్రత్తగా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటిని కుళాయిల ద్వారా విడుదల చేయాలన్నారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

## నేడు పొగాకు వేలం కేంద్రానికి సెలవు

ఒంగోలు(రూరల్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకువేలం కేంద్రం-2లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీన వేలానికి సెలవు ప్రకటించినట్లు వేలం నిర్వహణాధికారి జె.తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో పొగాకు వేలం నిర్వహించటం సమస్యగా ఉంటుందని, అందువల్ల బోర్డు ఈడీ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# వానల దెబ్బకు రోడ్లకు కోత

» కంభం, కందులాపురం పంచాయతీల్లో రహదారులపై గుంతలు
నిలిచిన వర్షపు నీరు
» వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు

కంభం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలకు కంభం, అర్ధవీడు మడలాలలో పలు రోడ్లు కోతలకు గురయ్యాయి. రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా కంభం, కందులాపురం పంచాయతీల అధికారుల నిర్లక్ష్యం రెండు పంచాయతీలకు శాపంగా మారింది. ప్రధాన అంతర్గత రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం, కొన్ని చోట్ల డ్రైనేజీలు ఉన్నా వాటిల్లో పూడిక తీయకపోవడంతో డ్రైనేజీలు పొంగిపొర్లి వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్లు కోతలకు గురికావడంతో రోడ్లపై గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు అదుపుతప్పి గుంతలలో పడి గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా కంభం పంచాయితీ పరిధిలోని కంభం అర్బన్ కాలనీ నుంచి వచ్చే ప్రధాన మురుగు కాలువ కందులాపురం పంచాయతీ పరిధిలోని కాలువ గుండా ప్రవహిస్తుంది. అయితే ఈ మురుగు కాలువలను కొంతమంది ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కట్టడంతో మురుగు పోయే దారి లేక రోడ్లపై ప్రవహిస్తుంది. దానికి వానలు తోడవడంతో మురుగు ఇబ్బందులు తలెత్తాయి. కంభం ఆర్టీసీ బస్టాండు ముందు భాగంలో హజరత్ గూడెం పంచాయతీ పరిధిలోని ఇరిగేషన్ కాలువను, పంచాయతీ కాలువలపై ఆక్రమణలు పెరిగిపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతమంతా వర్షపు నీటితో నిండిపోయి గృహాలలోకి నీరు వెళ్తుండడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతలకు గురైన రోడ్లను బాగు చేయడమేగాక మురుగు నీటి కాల్వలను నిర్మించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.


గుంతల రోడ్డుపై నిలిచిన వాన నీటిలో ద్విచక్రవాహనంపై వెళ్తూ ఇబ్బందులు పడుతున్న మహిళ

### కాల్వల్లో కదలని మురుగు
### ఇబ్బందులు పడుతున్న స్థానికులు

రాచర్ల : మండలంలోని అనుములవీడు దళిత కాలనీలోని సైడ్ కలువల్లోని మురుగనీరు బయటకు పోయే మార్గం చూడాలని కాలనీ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాలనీలోని సైడ్ కాలువలు వర్షపు నీరు, మురుగు నీటితో నిండి ఆ నీరంతా రోడ్లపైకి వస్తున్నాయని దీంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారన్నారు. 2019 దాదాపు రూ.30లక్షల వ్యయంతో సైడ్ కలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని అయితే అప్పటి పాలకులు, అధికారులు కాలువల నిర్మాణంలో ఎలాంటి ప్రణాళిక లేకుండా తమకు ఆదాయం వస్తే చాలు అన్నట్లుగా నిర్మించారని, కాల్వలకు చేరే నీరు ఎక్కడికి పోవాలి? ఎలాపోవాలి ? అనే ఆలోచన చేయకుండా నిర్మించడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. గృహాల నుంచి నీరు, వర్షపు నీరు కాలువల్లో చేరి ఆ నీరు పోయేమార్గం లేక రోడ్ల పైన గృహాల ముందు కుంటలుగా మారుతున్నాయని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారన్నారు. వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి అధికమై ఽ అనేకమంది అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రెండు, మూడు నెలల నుంచి పారిశుధ్య కార్మికులు ఉన్నారో లేదో కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందని. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. వాటర్ ట్యాంకులు పాచిపట్టి కంపుకొడుతు న్నాయన్నారు. ట్యాంకులకు ట్యాపులు పగిలిపోయినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గానీ, పాలకులు గానీ కాలనీవైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్వచ్ఛ భారత్, స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర అంటూ పాలకులను అధికారులు అప్రమత్తం చేస్తున్నప్పటికీ ఇక్కడి పాలకులకు, అధికారులకు ఆ నిబంధనలు వర్తించడం లేదని ప్రజలు బహిరంగంగా అంటున్నారు. అధికారులు, పాలకులు తమ నిర్లక్ష్యాన్ని వీడి గ్రా మాలను సందర్శించి సమస్య లు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలని, లేకపోతే స్వచ్ఛ ఆంధ్ర అంధకార ఆంధ్రగా మారుతుందని వారన్నారు.


బురదమయంగా ఉన్న సట్టుతాండా రోడ్డు

## సట్టు తాండా రోడ్డు దారుణం

### ఇబ్బందులు పడుతున్న సుగాలీలు

పుల్లలచెరువు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలంలోని పంచాతీయరాజ్ రోడ్డులు దారుణంగా ఉన్నాయి. వానలు కురిస్తే ఆ రహదారులు మాగాణిలను తలపిస్తాయి. పుల్లలచెరువు మండలంలోని సుద్దకురువ తాండా పంచాయతీలోని సట్టు తాండాకు నేటికీ రోడ్డు లేదు. దీంతో సుగాలీలు ఇబ్బందులు పడుతున్నారు. పుల్లలచెరువు - మల్లాపాలెం రోడ్డు నుంచి సుద్దకురువ వరకు బీటీ రోడ్డు ఉన్నా అక్కడ నుంచి సట్టు తాండాకు 1.5 కీలో మీటర్ల రోడ్డు లేక రాకపోకలకు సుగాలీలు ఇబ్బంది పడుతున్నారు. వాన పడితే బురద దారిలో వాహనాలు ఇరుక్కుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శాశ్వత రోడ్డును వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కంట్రోల్ రూం ఏర్పాటు

గిద్దలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుఫాన్ వలన కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గిద్దలూరు రెవెన్యూ కార్యాలయం ఆవరణలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు కంట్రోల్ రూం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు, అలాగే రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఒక్కొక్క టీం చొప్పున అధికారులు కంట్రోల్ రూమ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశామని, వర్షాలకు సంబంధించి ఏ ఇబ్బంది జరిగినా కంట్రోల్ రూంను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సగిలేరువాగులో నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున వాగు పరీవాహక ప్రాంతాలలో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు, ఈ పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. దిగువమెట్ట నుంచి ప్రతాప్‌రెడ్డి కాలనీ వరకు, భీమలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి ప్రతాప్‌రెడ్డి కాలనీకి వెళ్లే సగిలేరువాగు వరకు, కొండపేట ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర సగిలేరువాగు వద్ద టీములను ఏర్పాటు చేసినట్లు, ఒక్కొక్క టీమ్‌లో విఆర్‌ఒ, వీఆర్‌ఏ లేదా పంచాయతీ సెక్రటరీలు ఉండే విధంగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రజలు కూడా వీలున్నంత వరకు వాగులు, వంకలు, కుంటల్లోకి దిగవద్దని పేర్కొన్నారు.


మొక్కపైనే కుళ్లిపోతున్న పత్తి కాయలు

## ముసురు.. బేజారు

» మిరపలో పెరుగుతున్న కలుపు » కుళ్లుతున్న పత్తి కాయలు

పెద్ద దోర్నాల : మండలంలో కురుస్తున్న ముసురువానకు సాగు చేసిన పంటలు నష్టానికి దారి తీస్తున్నాయి. రైతులు అయోమయానికి గురవుతున్నారు. అతివృష్టి అనావృష్టి కారణాలతలో పైర్లు చేతికందక రైతులు ఆందోళనలో పడ్డారు. ఈ ఏడాది ఆరంభం వరకు అనావృష్టి ఉండగా, అదును దాటి పోకుండా అష్టకష్టాలు పడి ఖరీఫ్‌లో పత్తి, మిరప వేశారు. బోర్ల నుంచి వచ్చీరాని నీటితో పంటలు కాపాడుకున్నారు. ఆగస్టు-సెప్టెంబరులో కురిసిన వర్షాలకు సంతోషించారు. వేసవిలో సాగు చేసిన పత్తి తీతలు దాదాపు పూర్తి కావచ్చాయి. అయితే వర్షాలు సమయానికి కురుస్తున్నాయని భావించిన పలువురు పత్తిని తొలగించి మిరప నాటారు. ఇటీవల రోజూ వానలు కురుస్తుండడంతో కలుపు పెరిగిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప మొక్కలు ఆకులన్నీ రాలిపోయి ఎర్రగా మారుతున్నాయి. ఎకరాకు 12,000 వేల మొక్కలు నాటాల్సి ఉండగా విడతల వారీగా 2,000 మొక్కలు నాట్లు వేశారు. అయినా మిరప మొక్కలు కుదురుకోలేదు. వాన వీడక పోవడంతో పైరు చేతికొస్తుందా రాదా అని ఆందోళన చెందుతున్నారు. గాలులు లేకపోవడంతో అరటి, బొప్పాయికి నష్టం లేదని చెప్తున్నారు.

### చెట్లపైనే కుళ్లుతున్న పత్తి కాయలు

జూలై, ఆగస్టులో ఖరీఫ్ సాగు చేసిన పత్తి రైతులది మరో వేదన. ముందుగా సాగు చేసిన పత్తి రైతులు తీతలు పూర్తి చేసి తొలగించి కొందరు మిరప నాట్లు వేసుకోగా మరి కొందరు మొక్కజొన్న, మినుము, ఉలవ తదితర అపరాలను విత్తారు. పత్తి తీత ఆలస్యమైన చోట ముసురు దెబ్బతీస్తున్నాయి. కాయలు చెట్లపైనే కుళ్లి పోతున్నాయి. ధరలు పడిపోయాయి. కూలీలకు కూడా సరిపోని ధరలు అడుగుతున్నారు. క్వింటాకు రూ.3,500 నుంచి రూ.4,200 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో బాగా నష్ట పోతున్నామని పత్తి రైతులు వాపోతున్నారు. సీసీఐ కొనుగోళ్లు ఎక్కడా అని ప్రశ్నిస్తున్నారు.

### షేడ్‌నెట్ల నారుతో రైతులకు నష్టం

ఈ ఏడాది తొలి నాళ్లలో షేడ్ నెట్లలో నార్లు పోసేందుకు యజమానులు జంకారు. రైతులు ఇచ్చిన ఆర్డర్ల మేరకే నార్లు పోషణ చేశారు. ఆగస్టు నుంచి కురుస్తున్న వానలను చూసి సెప్టెంబరులో విపరీతంగా నార్లు పోశారు. మొక్క రూ.1కి తగ్గకుండా అమ్మకాలు చేశారు. ట్రేలో 100 మొక్కలు ఉండాల్సి ఉండగా 70 శాతం కూడా లేకున్నా వంద మొక్కల చొప్పున అమ్మకాలు జరిపారు. అధికారులు పట్టించుకోక పోవడంతో వారి ఇష్టం వచ్చినట్లు అమ్ముతున్నారు. నాట్లు వేసిన భూముల్లో మధ్యలో వేరు పురుగుతో కొన్ని, నీటి తేమ శాతంతో కొన్ని అరక సేద్యంతో కొన్ని మొక్కలు చనిపోతున్నా తప్పని పరిస్థితిల్లో రైతులు కొనుగోలు చేస్తున్నారు. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని షేడ్ నెట్ల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు.

తర్లుపాడు : వర్షాలకు మిరప పైరు దెబ్బతిన్నది. సీతానాగులవరం, తర్లుపాడు, నాయుడుపల్లెలో సాగు చేసిన మిరప ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలబడి ఉరకెత్తుతాయోమనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో తర్లుపాడు, సీతానాగులవరం, నాయుడుపల్లె, మీర్జపేట, పోతలపాడు, గానుగపెంట, కలుజువ్వలపాడులో సుమారు 800 ఎకరాల్లో మిర్చిని సాగు చేశారు. బర్లీ పొగాకు కూడా ఉరకెత్తే అవకాశం ఉందని రైతు లు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు ఎక్కువైతే మిర్చి, బర్లీ పొగాకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

కొనకనమిట్ల : వర్షాలతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని పెదారికట్ల గ్రామంలో బుధవారం దర్శి వ్యవసాయసహాయకులు బాలాజీనాయక్, ఏవోలు పత్తిపంటను పరిశీలించారు. పంటను కాపాడుకునేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, బీఏఏ గంగయ్య పాల్గొన్నారు.

### వర్షాలు కొనసాగితే పత్తికి నష్టం : ఏడీఏ బాలాజీ నాయక్

పెద్దారవీడు : మండలంలోని సాగుచేసిన పత్తికి ఇప్పటి వరకూ కురిసిన వర్షాలతో ఎటువంటి ఇబ్బంది లేదని, ఇంకా వర్షాలు కురిస్తే నష్టం తప్పదని ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని పుచ్చకాయలపల్లిలో వర్షపునీరు నిలిచిన పత్తి పొలాలను బుధవారం వ్యవసాయాధికారితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడు భూములలో పత్తి మొక్కల ఆకులు ఇప్పటికే నల్లబడే పరిస్థితి ఉందన్నారు. వానలు కొనసాగితే పశ్చిమ ప్రకాశంలో సాగుచేసిన పత్తితోపాటు వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సిబ్బంది సునీల్‌కుమార్, వీఏఏ ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

### పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

కంభం : తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపే చర్యలు చేపట్టాలని మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు డీ బాలాజీనాయక్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన తురిమెళ్ల, ఎర్రబాలెం, నర్సిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. వరి పంట వెయ్యి ఎకరాలలో సాగులో ఉందన్నారు. పం ట అంతా దుబ్బుదశలో ఉందని ప్రస్తుత వర్షాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో కంభం మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్, వీఏఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆటల్లోనూ రాణించాలి



ఎంపికైన బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అన్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదివిని విద్యార్థునులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం వారిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పిన్నిక జాహ్నవి ప్రియ, పీఈటీ రోహిణి, పండిత్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

### ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చూడాలని, గ్రామాలలో కూడా పర్యటించి పరిస్థితులను తెలుసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన నివాసంలో నియోజకవర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన కొన్ని పనులు రద్దయ్యాయని, అవి తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలో మరుగు దొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అశోక్‌రెడ్డి తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


కాలువల్లో ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న అధికారులు

రాచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని వర్షాల వలన ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. ఎస్‌ఐ పీ కోటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన చోళ్లవీడు, అచ్చంపేట, ఆకవీడు, చిన్నగానిపల్లి, జేపీ చెరువు, రాచర్ల గ్రామాల్లో పర్యటించారు. రంగనాయక స్వామి దేవస్థానాన్ని సందర్శించి గుండంలోకి భారీగా వరద నీరు చేరుతుందని భక్తులను లోనికి అనుమతించవద్దని చెక్‌పోస్ట్ సిబ్బందికి సూచించారు.

## ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదువుకోవడం ద్వారా భవిష్యత్ బంగారులా ఉంటుందని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముత్తుముల భాస్కర్‌రెడ్డి కల్యాణ మండపంలో సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ బ్యాచ్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బవిష్యత్‌పై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సాయి చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గోపవరం రంగస్వామిరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయాలి

పొదిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ కలిగిన ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని కరుణ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు బుధవారం ప్రకటనో తెలిపారు. గ్యాస్ నెంబర్‌కు ఆధార్, బ్యాంక్ ఖాతా లింక్ చేసుకోకపోవడం వలన కేంద్ర ప్రభుత్వ ఉజ్వల సిలిండర్ రాయితీ, రాష్ట్ర ప్రభుత్వ దీపం పథకం రాయితీ సొమ్ము కొందరికి పడడం లేదని తెలిపారు. పథకం లబ్ధి రానివారు తప్పనిసరిగా ఏజెన్సీ వద్దకు వచ్చి ఈకేవైసీ, లింక్ చేయించుకోవాలని కోరారు. లేకుంటే డెలివరీ బాయ్ వద్ద చేయించుకోవాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తుల దర్శనానికి బారులు తీరారు. అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మ స్వామి మూలవిరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచారు. నవగ్రహ, నాగమయ్య విగ్రహాలకు పాలుపోసి పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.


కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

### గంగమ్మ, గౌరమ్మకు పూజలు

గిద్దలూరు : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో గంగమ్మ, గౌరమ్మను ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా కుంకుమపూజలు నిర్వహించారు. నెలరోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజు నిమజ్జన కార్యక్రమం చేయనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

### కాశినాయనకు పూజలు

పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు స్వామికి అభిషేకం చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు రెడ్డి రామాంజనేయరెడ్డి సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో వివిధ సంస్థల ప్రతినిధులు నారాయణరెడ్డి, డాక్టర్ ఖాదర్‌వలి, దాత ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

### హనుమంతునికి ఎమ్మెల్యే పూజలు

కొమరోలు : మండలంలోని హనుమంతురాయునిపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం కార్తీక మాసం తొలి రోజున ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీల కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు.

### 600 మంది దీక్షల స్వీకరణ

పొదిలి : పట్టణంలో ఒక్కరోజే 600 మంది భక్తులు అయ్యప్ప దీక్షలను స్వీకరించినట్లు అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యులు తెలిపారు. కార్తీకం తొలిరోజు, బుధవారం అయ్యప్ప పుట్టినరోజు కావడంతో పెద్ద సంఖ్యలో దీక్షధారణ జరిగినట్లు తెలిపారు.

ఎర్రగొండపాలెం రూరల్ : కార్తీక పూజలతో ఆలయాలు మార్మోగాయి. శ్రీ పార్వతీవర్ధిని సమేత వృశ్చికాల మల్లేశ్వర స్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. రాత్రికి ఆకాశ దీపాన్ని వెలిగించారు.


ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న చిన్నారులు

## తండ్రీకొడుకుల మృతిపై విచారణ

పొదిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సలకనూతల గ్రామంలో మంగళవారం జరిగిన తండ్రీకొడుకుల మృతి మిస్టరీ గానే ఉంది. బుధవారం సీఐ రాజేష్, ట్రాన్స్‌కో ఎస్‌ఐ కె.యద్వత్, అంకమరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను పరిసరాలను పరిశీలించారు. విద్యుత్ షాక్ వల్ల అని కొందరు, ట్రాక్టర్ ప్రమాదం అని మరికొందరు చెప్తున్నారు. మృతిగల కారణాలను ఛేదించేందుకు అధికారులు గ్రామాన్ని సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. అయితే కోటేశ్వరావు ఛాతిపై గాయం ఉండడంతో విద్యుత్ షాక్ వల్లా, ట్రాక్టర్ ప్రమాదమా అనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కోటేశ్వరావు పెద్దకుమారుడు మాదాల చెంచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.


పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ జయ

## వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

రాచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ డీ జయ అన్నారు. రాచర్ల ఫారం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికలకు అందే విద్య, భోజనం, మౌలిక వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం, మెరుగైన వసతుల కల్పనలో చిన్నపాటి లోటు పాట్లు కూడా లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. తరగతి గదులు వంటగది స్టోర్ రూం పాఠశాల ఆవరణలో గడ్డి తొలగింపు, మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి వినియోగం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముమ్మరంగా వర్షాలు కురుస్తున్నాయని బాలికలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యలో వెనుక డిర ఉన్న బాలికలకు ప్రత్యేక శిక్షణతో బోధించాలని, పాఠశాలలో ప్రతిఒక్కరూ ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా శ్రమించాలని అన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ మేరీ మంజుల సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడండి

రాచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లే కుండా చూడాలని మండల ఎంఈవో గిరిధర్ శర్మ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం ఆయన ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయని విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఇంటికి వెళ్ళే వరకు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బిఎల్ రామానాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈవో



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## పేదలకు సీఎం సహాయనిధి తోడ్పాటు

- రూ. 55.92 లక్షల

### చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వైద్య సహాయం కోసం తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం రూ. 55,92,693 ల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ఎంతో మంది పేద కుటుంబాలకు చెందిన సభ్యులు అనారోగ్యం పాలైతే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసుపత్రుల్లో చూపించుకోలేక ఇంకా అనారోగ్యం పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వమే వైద్యానికి అయ్యే ఖర్చును భరిస్తుందన్నారు. కూటమి ప్రభు త్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, బాలు ఓబులురెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, షేక్ ఫిరోజ్, యారవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

పామూరు :ఆపదలో ఉన్న పేదల ఆరోగ్య భరోసాకు ఆదరణగా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండ అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లోని ఉగ్ర క్యాంప్ కార్యాలయంలో బుధవారం చెక్కుల పంపిణీ జరిగింది. మండలంలోని కంభాలదిన్నె పంచాయతీ రజా సాహెబ్‌పేట గ్రామానికి చెందిన మేలంగి భారతికి వైద్య అవసరాల కోసం ఎమ్మెల్యే ఉగ్ర సీఎంఆర్‌ఎఫ్ కింద చెక్కును బుధవారం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 23 మంది బాధితులకు రూ.11,71,423 లకు చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కంభాలదిన్నె టీడీపీ అధ్యక్షుడు మన్నం రమణయ్య, పామూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎన్. సాంబయ్య, నీరుకట్టు నాయబ్‌రసూల్, తదితరులు ఉన్నారు.




పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- ధర్నాలో మున్సిపల్ కార్మికుల డిమాండ్

కనిగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఖాదర్‌వలి మాట్లాడుతూ ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో తీసుకున్న అదనపు కార్మికులను ఆప్కాస్‌లో నమోదు చేసి జీతాలు చెల్లించాలన్నారు. యూనియన్ నాయకుడు నాసర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హై స్కిల్డ్ గా విభజించాలన్నారు. విధుల్లో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకుని ఆప్కాస్‌లో నమోదు చేసి జీతాలు కల్పించాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కోటయ్య, అశోక్, కిరణ్, శేషయ్య, మస్తాన్‌వలి, సాల్మన్, తాజుద్దీన్, మధు, ఐజాక్, మస్తాన్, వాసు, వెంకటేశ్ పాల్గొన్నారు.



స్కూలు పిల్లలకు పంపిణీ చేసిన బ్యాగులతో దాత నరసింహారావు

## 80 మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

పామూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె పంచాయతీలోని రెండు ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో 80 మంది విద్యార్థులకు చుంచు నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం. మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థుల వసతుల కల్పనకు దాత అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్త గీత, స్కూల్ కమిటీ చైర్మన్ రాయ మధు పాల్గొన్నారు.

## ఆలయ పవిత్రతను కాపాడాలి

పామూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలోని మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవాలయాల పవిత్రను, గౌరవాన్ని కాపాడాల్సి బాధ్యత ఈవో, పాలకమండలిపై ఉందని ఎండోమెంట్ ప్రాంతీయ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. దేవస్థానాలను బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణపనులను పరిశీలించి ఆగ్రహం వక్తం చేశారు. అనుమతులు లేకుండా శాస్త్రోక్తంగా కాకుండా నిర్మించిన నిర్మాణాలపై ఈవోను మందలించారు. భుజంగేశ్వర దేవస్థాన గర్భాలయంలో మూల విరాట్ చుట్టూ టైల్స్ వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పురాతన శివాలయం ఉన్నప్పటికి మరో శివాలయం నిర్మించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేవాలయ ఆవరణలో ఉన్న గోవులసంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా నిర్మాణాలు ఉండాలని సూచించారు.

### ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభం

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులోని రజక వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతురాజు స్వామి సహిత వీర్ల అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠ నేపథ్యంలో బుధవారం మహా గణపతి హోమంతో ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ముందుగా గణపతి పూజ, మాతృక పూజ, రక్షాబంధనం, యాగ శాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన పూజలు నిర్వహించారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం పూజల అనంతరం ప్రతిష్ఠ జరగనుంది.



ప్రతిష్ఠకు ముస్తాబైన వీర్ల అంకమ్మ తల్లి దేవాలయం

# అల్పపీడనంతో జోరు వర్షాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు
- అధికారులు, పోలీసుల పర్యవేక్షణ

పామూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా గత అర్ధరాత్రి నుంచి పామూరు, సీఎస్‌పురం మండలాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఈ వర్షంధాటికి పామూరు మండలంలోని బోడవాడ గ్రామంలోని దుప్పలపొందువాగు,కొత్తవాగు,రేణిమడుగు గ్రామంలోని చెరువు, కంభాలదిన్నె గ్రామంలోగల మన్నేరు



సీఎస్‌పురంలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వాగు నీటి ఉధృతితో పరవళ్ల తొక్కుతున్నాయి. సుమారు 4 సంవత్సరాల అనంతరం భారీగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని వాగులు, వంకలు, చెరువులు నీటితో నిండి కళకళలాడుతుండటంతో గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తంచేస్తు న్నారు. వర్షం ప్రభావంతో నీరు చేరిన పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధి, విరాట్ నగర్, తిరగళదిన్నె, జంగాలపల్లి తదితర లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ ఆర్. వాసుదేవరావు తన సిబ్బందితో బుధవారం పర్యటించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సుమారు 50 మందిని అంకాలమ్మవీధిలో గల ప్రభుత్వ పాఠశాలలోకి తరలించి భోజన వసతి లాంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మోపాడు రిజర్వాయర్‌లో నీటి ప్రభావాన్ని మోపాడు నీటి సంఘం వైస్ చైర్మన్ ఎం. నరసింహారావు యాదవ్‌తో కలిసి ఎస్ఐ టి.కిశోర్‌బాబు పరిశీలించారు. రిజర్వాయర్‌లో గతంలో 9 అడుగుల మేర నీరు నిల్వ ఉండగా ప్రస్తుతం కురుస్తున్న వర్షం ప్రభావంతో ఒక అడుగు మేర నీరు చేరిందని ఇరిగేషన్ అధికారి తెలిపారు. కంభాలదిన్నె గ్రామంలో గల మన్నేరు వాగు ఉధృతి వద్ద ఎస్ఐ తన సిబ్బందితో ప్రజలు వాగు వద్దకు ఎవరూ వెళ్లకుండ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ధాటికి పట్టణ ప్రజలు, రోజువారీ కూలీలు అసౌకర్యం చెందుతున్నారు. గొర్రెల కాపరులు ఎవరూ అడవిలోకి వెళ్లవద్దని గ్రామాల్లో వీఆర్వోలు సూచనలు చేస్తున్నారు. కాగా మండల కేంద్రమైన సీఎస్‌పురంలో తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి రోడ్లపై నీరు ప్రవహిస్తున్నది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుపాన్ ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతవరణ శాఖ హెచ్చరికలు జారిచేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు., ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు సాగులో ఉన్న వరి, కంది, మినుము పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఏవో టి. అబ్రహం లింకన్ తెలిపారు.

### నీటి కాలువల పరిశీలన

కురుస్తున్న వర్షాలకు పామూరు పట్టణంలోని పాత, కొత్త చెరువుల్లో పుష్కలంగా నీరు చేరింది. దాంతో అలుగు పారుతున్నది. దీంతో గోపాలపురం వద్ద ఉండే అలుగు నీరు సమీపంలోని ఎస్సీ పాలెంలోకి రాకుండా నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, వీఆర్వో దినేష్‌లు చెరువు కాలువలను పరిశీలించారు. అలుగు నీరు కాలనీల్లోకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టారు.



బోడవాడలో వృద్ధురాలిని వాగు దాటిస్తున్న ఎంపీడీవో

### ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, ఎవరూ బయటకు రావద్దని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు. మండలంలోని బోడవాడ గ్రామంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. 65 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధురాలు ప్రవహిస్తున్న వాగు దాటేందుకు యత్నిస్తుండగా గమనించిన ఎంపీడీవో ఆమెను సురక్షితంగా దాటించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రఫీ, టీడీపీ నాయకుడు మల్లికార్జున ఉన్నారు.



పామూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుప్పలపొందు వాగు

### కురిచేడులో ఎడతెరిపిలేని వాన

కురిచేడు : మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం ప్రారంభం అయిన వర్షం సాయంత్రం వరకు పడుతూనే ఉంది. కలెక్టరు ఆదేశాలతో మండలంలోని పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు.

**తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజల కోసం ముందస్తుగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రజనీ కుమారి తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలెవరూ బయటకు వెళ్లవద్దని సూచించారు. విపత్తు నిర్వహణలో భాగంగా మండల వాసులకు ఏ అవసరం వచ్చినా తమ కార్యాలయంలోని కంట్రోల్‌రూంకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ సూచించారు.

## రాత్రి సమయాల్లో వాగులు దాటొద్దు

- ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని వాగులు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నందున ముందు జాగ్రత్తగా ఎస్ఐ కే కమలాకర్ బుధవారం సాయంత్రం మండలంలోని మారెళ్ళ, జమ్మలమడక మధ్య ఉన్న ఈదర వాగును పరిశీలించారు. ప్రస్తుతం వాగు చప్టా మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. రాత్రుల సమయాల్లో వాహన చోదకులు , ప్రజలు వాగులు దాటవద్దన్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున అర్ధరాత్రి కల్లా నీరు ఉధృతంగా వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వాగుల వద్ద పోలీసు సిబ్బందితో కాపలా ఉంచుతామన్నారు. ఈదర, బొప్పూడి వారిపాలెం మధ్య ఉన్న వాగును ముండ్లమూరు - వేంపాడు మధ్య ఉన్న చిలకలేరు వాగును ఆయన సిబ్బందితో కలసి పరిశీలించారు.

ఈ సందర్భంగా సిబ్బంది కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాత్రుల సమయాల్లో ఎవరైనా వాగుల్లోకి దిగి ప్రమాదంలో ఉంటే వెంటనే తన సెల్ నెంబరు 9121102164కు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ ఎన్. వెంకటేశ్వరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మహేష్ ఉన్నారు.



మారెళ్ళ - జమ్మలమడుగు మధ్య ఉన్న ఈదర వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ కమలాకర్

# వర్షాలకు దెబ్బతిన్న పైర్లు

**ఆందోళనలో రైతులు**

దర్శి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు సాగుచేసిన పైర్లు దెబ్బతినటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట దశలో ఉన్న పత్తి, మొక్కజొన్న, బొప్పాయి తదితర పంటలకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం వాయుగుండం ప్రభావంతో భారా వర్షాలు కురుస్తున్నాయి. దర్శి ప్రాంతంలో సాగుచేసిన పత్తి పంట కాయ పగిలి కోతకొచ్చింది. దీంతో వర్షాలకు పత్తి తడిసి రంగు మారుతోంది. పొలంలో నీరు నిల్వ ఉండటంతో మొక్కలు ఉరకెత్తుతున్నాయి. అదేవిధంగా మొక్కజొన్న పంట కంకి తీసే దశకు వచ్చింది. వర్షాలు అధికమైతే కంకులు విరిగిపోయే ప్రమాదం నెలకొంటుంది. బొప్పాయి తోటలు కాయదశలో ఉన్నాయి. ఈదురు గాలులు, వర్షాలకు కాయలు రాలిపోతుండటంతో ఆరుగాలం కష్టించి, వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతికందే సమయంలో నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలకు లేత వైట్‌బర్లీ పొగాకు దెబ్బతింటోంది ఇంకా వర్షాలు అధికమైతే కంది, కంకి దశకు చేరిన వరిపైరు కూడా దెబ్బతినే పరిస్థితి ఉంది. మరో నాలుగు రోజులు పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.



చిన్నగుడిపాడులో వర్షాలకు ఉరకెత్తిన పత్తి చేను

### సజ్జ కంకుల నుంచి రాలుతున్న గింజలు

కనిగిరి : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కనిగిరి ప్రాంతంలో ఇప్పటికే సాగులో ఉన్న మెట్ట పైర్లకు జీవం పోసింది. కనిగిరి నియోజకవర్గంలో ఎక్కువగా కంది సాగు చేపట్టిన రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఆశించినంత వర్షాలు లేక పైర్లకు సరైన నీరు లేక ఎండు ముఖం పట్టాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంది పచ్చదశకు చేరుకుని జీవం పోసుకున్నాయి. ఇంకా నాలుగు రోజులు పాటు ఇదే వర్షపాతంతో వర్షాలు పడితే చేలల్లో నీరు నిలిచి పూత రాలిపోయి నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. అదేవిధంగా వెలిగండ్ల మండలంలో అత్యధికంగా సజ్జ సాగు చేపట్టారు. ఇప్పటికే కంకులు రావటంతో కురిసిన వర్షాలకు అక్కడక్కడా పొలాల్లో నీరు చేరుతున్నాయి. దీంతో సజ్జ కంకులు కుళ్లిపోయి మొలకెత్తే అవకాశం ఉందని రైతులు చెప్తున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు సజ్జ పైరు కంకులు వంగిపోయి సజ్జ గింజలు రాలిపోవటంతో పాటు మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వెలిగండ్లలో వర్షానికి తడిసి గింజలు రాలిపోయిన సజ్జ కంకులు

### ముంచిన వర్షాలు



- పొన్నెబోయిన నాగేశ్వరరావు, రైతు, చిన్నగుడిపాడు గ్రామం

నేను ఎనిమిది ఎకరాల్లో పత్తి వేశాను. ఇప్పటి వరకు ఎకరాకు దాదాపు రూ.30వేలు ఖర్చుచేశా. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంట తడిసి దెబ్బతిన్నది. ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఎంతో ఆశించిన తమను అకాల వర్షాలు నట్టేట ముంచాయి. ఇంతటితో వర్షాలు ఆగితే ఎకరాకు మూడు లేదా నాలుగు క్వింటాళ్లు దక్కుతుంది. వర్షాలు ఆగకపోతే పెట్టుబడులు రావు. నష్టాలు తప్పవు.



చిందరవందరగా పడిఉన్న ఎరువుల బస్తాలు

### రైతు సేవాకేంద్రంలో

## ఎరువుల బస్తాలు మాయం

కురిచేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవరం రైతు సేవా కేంద్రంలో 20 రసాయన ఎరువుల బస్తాలు మాయం అయ్యాయి. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి సంపత్ కుమార్ ఆదేశాలతో రైతు సేవా కేంద్రం సహాయకురాలు హారిక కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత శనివారం వ్యవసాయ శాఖ సిబ్బంది పనిసమయం ముగిశాక ఇంటికి వెళ్లే సమయంలో తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం సిబ్బంది వచ్చి చూస్తే తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఉన్నతాధికారులను పిలిచి ఎరువుల బస్తాలు లెక్క తేల్చగా 10 బస్తాల డీఏపీ, 10 బస్తాలు 20-20 దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వీటి విలువ రూ.27,200లు అని వ్యవసాయాధికారి తెలిపారు. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పట్టుబడిన అక్రమ మద్యం సీసాలతో దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

## బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- 28 మద్యం సీసాల స్వాధీనం

దొనకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు, ఆరవల్లిపాడు గ్రామాల్లోని అనుమానిత ప్రదేశాల్లోని బెల్ట్‌షాపులపై దర్శి ఎక్సైజ్ సీఐ కె శ్రీనివాసరావు నేతృత్వంలో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెల్లబాడు గ్రామంలో సుబ్బరాయుడు అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వాహణ నిమిత్తం 13 మద్యం సీసాలు, ఆరవల్లిపాడు గ్రామంలో పాపయ్య అనే వ్యక్తి 15 అక్రమ మద్యం సీసాలు కల్గి ఉండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎక్సైజ్ ఎస్ఐ షేక్ యూసఫ్‌షరీఫ్, సిబ్బంది సాయిబాబా, ఎస్ శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

# రహదారులిలా.. రాకపోకలు సాగేదెలా ?

- వర్షాలకు బురదమయమైన గ్రామీణ రహదారులు
- అదుపుతప్పి పడిపోతున్న వాహన చోదకులు

దొనకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బురదమయంగా మారటంతో రాకపోకలు సాగించేదెలా అంటూ గ్రామాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చందవరం గ్రామంలోని ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డు నీటి కుంటలా దర్శనమిస్తోంది. ప్రస్తుతం రోజూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామస్థులు ఆ రహదారిపై నడవాలంటేనే హడలిపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారి అభివృద్ధి పట్ల పాలకులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవటంతో రహదారి మొత్తం గుంతల మయమైంది. ప్రముఖ పుణ్య క్షేత్రమైన త్రిపురాంతకం దేవాలయం, చందవరం బౌద్ధస్థూపాలకు వెళ్లేందుకు ఈ రహదారిపైనే వెళ్లాల్సి ఉంది. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన అధికసంఖ్యలో వాహనాలు రోజూ ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. వర్షం కురిసిన సమయంలో ఈ రహదారిపై వాహన చోదకులు అదుపుతప్పి జారి పడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామస్థులు రాకపోకలు జరుపుకునేందుకు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలకులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అదేవిధంగా దొనకొండ అడ్డరోడ్డులోని ఎస్టీ కాలనీలోని మట్టి రోడ్డు వర్షం కురిస్తే బురదమయం అవుతోంది అధికారులు, పాలకులు పట్టించుకొని సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు నీటి కుంటను తలపిస్తున్న చందవరం గ్రామంలోని ప్రధాన రహదారి | కురుస్తున్న వానలకు బురదమయమైన దొనకొండలోని ఎస్టీ కాలనీ రహదారి

## పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పీసీపల్లి,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జీవీ కృష్ణారావు తెలిపారు.ఈనెల 23,24తేదీలలో పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల, పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ ఆధార్ కేంద్రాల్లో విద్యార్థినీ విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కుంభాభిషేకంకు రావాలని 'ఉగ్ర'కు ఆహ్వానం



ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పామూరు విశ్వబ్రాహ్మణులు

పామూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణ పరిధిలోని విరాట్‌నగర్‌లో జరిగే మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు రావలసినదిగా కోరుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బుధవారం అమరావతి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. విరాట్ నగర్ కాలనీలోని శ్రీ గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన సహస్ర కలశ మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేక మహోత్సవం నవంబరు 1వ తేదీ నుంచి 3తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. 1న శివాలయ ప్రతిష్ఠ, 2న ఆదివారం వీరబ్రహ్మంగారి 417వ జయంతి, 3న సోమవారం దేవస్థాన 12వ వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉగ్రను కలిసిన వారిలో ఎస్. నాగేంద్రాచారి, ఎం. దొరసానయ్యచారి, ముఖేష్ చారి, ఎస్. చంద్రశేఖర్, గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

# ముసురు.. ముంపు

అల్పపీడనం.. రైతులను ముంచేస్తోంది. పైరు నీటి పాలైంది. ఈదురుగాలులకు నేలవాలింది. కోతలకు సిద్ధమైన వరి చేతికి అందదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడుతున్నాయి. మంగళ వారం అర్ధ రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ముసురు పట్టినట్లు వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం పంటల కు మేలు చేయగా కంకి దశలో ఉన్న వరి, తీత దశలో ఉన్న పత్తి తదితర పంటలకు నష్టం చేసింది. కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. వరదలకు పంట దెబ్బ తిన్న చేలల్లో మినుము విత్తిన రైతు లకు మాత్రం మళ్లీ నష్టం తప్ప దని చెబుతున్నారు. పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు జలమయంగా మారడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- అల్పపీడనంతో వీడని వర్షాలు
- పంటలు వర్షార్పణం.. రైతుల ఆందోళన
- కంకి దశలో వరి.. దిగుబడులపై తీవ్ర ప్రభావం



కొల్లూరు : మొసలిపాడు వద్ద నేలవాలిన వరిపైరు

తెనాలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో బుధవారం భారీ వర్షాలు పడ్డాయి. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు చేసిన వరి చేతికొచ్చే సమయంలో వర్షాలకు నేలవాలిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పైరు నేలవాలి వర్షపు నీటిలో నానుతుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగు 5.73 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఈ వర్షాలు రైతులను దెబ్బతీస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో ఇప్పటికే వరి కంకులు వచ్చి, గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కంకులు రాని పంటకు వర్షం మేలు చేస్తే, కంకి వేసిన పంటకు మాత్రం నష్టం తప్పడంలేదని రైతులు చెబుతున్నారు. గింజ పాలుపోసుకునే దశలో వర్షం ఎక్కువగా ఉంటే, గింజ తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గింజ పాలుపోసుకున్న చేలల్లో మాత్రం ముసురు కారణంగా మానుకాయ వల్ల కూడా నష్టం తప్పడంలేదంటున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరి పంట నేలవాలింది. కంకులు బరువు లేకున్నా కొన్ని చేలు చాపలా పరుచుకున్నాయి. దీంతో రైతులకు పంటను పైకి నిలబెట్టుకోవడం తలకుమించిన పని అవుతోంది. అరటి, బొప్పాయి, కంద, పసుపు పంటలు గత వరదలకు దెబ్బతనగా, మిగిలిన వాటికి వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వరదల తర్వాత మళ్లీ మినుము చల్లిన రైతులకు ఈ వర్షం నిరాశ మిగిల్చింది. మరోసారి ఆ రైతులకు నష్టం తప్పడంలేదు. మొక్క ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంటే, వర్షం ముంచేయడంతో అదికాస్తా దెబ్బతినపోతుందని, మరోసారి విత్తాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. అటు బాపట్ల జిల్లాలోని

(మిగతా 6వ పేజీలో)

### హోంమంత్రి అనిత కలెక్టర్లతో సమీక్ష

భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లతో అమరావతి రాజధాని నుంచి మంత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరయ్యారు.



### నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. బుధవారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు బోట్లు వేసుకుని తిరుగు ప్రయాణమై హార్బర్‌కు చేరారు.

# ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్!




గత 14 రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. పేద రోగులు అత్యవసర పరిస్థితుల్లో సొమ్ము చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ వైద్యశాలల మధ్య బిల్లుల బకాయి రగడ నడుస్తోంది. బకాయి చెల్లింపుల అంశంలో పలుమార్లు ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆస్పత్రుల నిర్వాహకులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశారు. బకాయి విడుదల కోరుతూ ఆందోళన బాట పట్టారు. గురువారం చలో విజయవాడకు నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ పిలుపు నిచ్చింది. పల్నాడు జిల్లాలో 111, గుంటూరు జిల్లాలో 128, బాపట్ల జిల్లాలో 60 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేసినట్లు యూనియన్ నేతలు తెలిపారు.

### ఉచిత వైద్యసేవలను నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

- వైద్యం అందక పేద రోగుల ఇక్కట్లు
- బిల్లుల విడుదల కోసం వైద్యుల ఆందోళన బాట
- నేడు చలో విజయవాడ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను కొంత మేర చెల్లించింది. అయితే పాత బకాయిలతో పాటు కొత్త బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్ వైద్య సేవలను నిలిపివేసి బకాయి (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది

# పిడుగుపాటుకు కూలిన జీవితాలు

- ఇద్దరు మహిళా కూలీల మృతి..
- మరో మహిళకు తీవ్ర గాయాలు


కమలమ్మ



ముజాహిదా

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడు గుపాటుకు వరి పొలంలో కలుపు తీస్తున్న ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పొన్నూరు పట్టణానికి చెందిన మహిళా కూలీలు బుధవారం పట్టణ శివారులో ఉన్న బాడవ డొంకలోని వరి పొలాల్లో కలుపు తీయడానికి వెళ్లారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో కూలీలు పంట పొలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలువ దాటుతున్న వలపర్ల కమలమ్మ (45) అలియాస్ మరియమ్మ, షేక్ ముజాహిదా (50) పిడుగుపాటుకు గురయ్యారు. పక్కనే ఉన్న పంట కాల్వలో విగత జీవులై పడ్డారు. వారి సమీపంలో ఉన్న మరో మహిళ మేళం మాణిక్యమ్మ గాయాలు కావడంతో.. స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తోటి కూలీలు, మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలంలో విగత జీవులుగా ఉన్న వారిని చూసి కంటతడి పెట్టుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరా నాయక్, తహసీల్దారు జియావుల్ హక్ ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సార్.. అభివృద్ధికి సహకరించండి

- సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ
- మిగిలిన పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని వినతి

పర్చూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలు, మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని ప్రత్యేకంగా కలిశారు. వర్షాలు, తుఫాన్ల సమయంలో వరద ముంపు నివారణకు నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతుల వద్ద మిగిలి ఉన్న నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**ఎమ్మెల్యే ప్రతిపాదనలు..**

- చీరాల నుంచి మోటుపల్లి వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.
- మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల, బొల్లాపల్లి గ్రామాలు, చిన్నగంజాం మండలంలోని కడవకుదురు, రాజుబంగారుపాలెం, ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల్లో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాలి.
- పర్చూరు నియోజకవర్గ పరిధిలో బకింగ్‌హామ్ కాల్వను అంతర్గత జల మార్గంగా అభివృద్ధి చేయాలి.
- మార్టూరు మండల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి.
- పర్చూరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సుమారు 5వేల ఎకరాల ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించాలి.
- గుంటూరు చానల్ పొడిగింపునకు 51 ఎకరాల భూసేకరణ నిధులు మంజూరు చేయాలి.



# ప్రకాశం జిల్లాలోకి అద్దంకి?

- కలెక్టర్‌ను నివేదిక కోరిన సీసీఎల్‌ఏ

అద్దంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సమీపంలోని అద్దంకి ప్రాంతవాసుల కల నెరవేరనున్నదా.. అంటే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అవునంటున్నాయి. అద్దంకిని ప్రకాశం జిల్లా పరిధిలోకి మార్చాలని ఆ ప్రాంతవాసుల డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా జిల్లాల విభజన చేసిన క్రమంలో అద్దంకి నియోజకవర్గం ఒంగోలుకు సమీపంలో ఉన్నా దూరంగా ఉన్న బాపట్ల జిల్లా పరిధిలో చేర్చారు. దీనిపై అప్పట్లోనే అద్దంకి వాసులు అనేకసార్లు ఆందోళనలు చేసినా ఎలాంటి స్పందన లేదు. ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో లోకేశ్ అద్దంకివాసుల డిమాండ్‌ను చేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో అద్దంకిని ప్రకాశం జిల్లాలోకి చేర్చే విషయంపై ప్రత్యేక దృష్టి సారించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. జిల్లాల పునర్విభజన కమిటీ దృష్టికి కూడా మంత్రి రవికుమార్ అద్దంకి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం అమరావతి నుంచి సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కార్యదర్శి వెంకటమురళి నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపే విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సూచించారు. అద్దంకి ప్రాంత సరిహద్దులు నిర్ణయిస్తూ నివేదిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఉన్నతస్థాయి అధికారులు దృష్టి పెట్టిన నేపథ్యంలో త్వరలోనే అద్దంకివాసుల కల నెరవేరుతుందని సమాచారం. అదే సమయంలో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి రవికుమార్ కృషి చేస్తున్నట్లు తెలుస్తుంది.

# పత్తి కొనుగోలు ఉత్తిదేనా?!

- సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై లేని స్పష్టత
- మొదలైన పత్తి దిగుబడులు
- నిబంధనల మెలికతో రైతుల ప్రయోజనాలకు గండి!
- జిల్లా ఆవిర్భావం నుంచి అదే తీరు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పంట దిగుబడులకు మద్దతు ధర లభించడం ఏటికేడు ఎండమావిగా మిగులుతున్న తరుణంలో.. ప్రభుత్వాలు నిర్దేశించిన గిట్టుబాటు ధర ఫలాలు అన్నదాతలకు అందడం లేదు. బాపట్ల జిల్లా ఆవిర్భవించి ఇప్పటికీ మూడేళ్లు గడిచినా.. పత్తి కొనుగోలు చేసే సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సేవలు.. ఇక్కడి రైతుల దరికి అంతంత మాత్రంగానే చేరుతున్నాయి. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో క్వింటా పత్తిని కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరించిన పాపాన పోలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో మాత్రం 13 వేల క్వింటాళ్ల పత్తిని మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు చేసింది. ఈ ఏడాది పత్తి దిగుబడులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కానీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవడంపై స్పష్టత రాలేదు. పర్చూరు నియోజకవర్గం పరిధిలో రెండు కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ ప్రకటించి (మిగతా 6వ పేజీలో)

### ప్రతి ఏడాదీ పత్తిసాగు

జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని పది మండలాల్లో ప్రతి ఏడాది పత్తి సాగు జరుగుతూనే ఉంటుంది. బాపట్ల జిల్లాగా ఆవిర్భావం జరిగిన తొలి రెండేళ్లు సీసీఐ కొనుగోలు కేంద్రాల జాడే కరువైంది. గతేడాది మాత్రం ఆలస్యంగా సీసీఐ కేంద్రాలను తెరిచినా.. అప్పటికే పెద్ద ఎత్తున పత్తి దళారుల వద్దకు చేరింది. ప్రస్తుతం ఆ గణాంకాలను సాకుగా చూపి, సాగు విస్తీర్ణం వంటి నిబంధనలతో మళ్లీ మొండి చెయ్యి చాచడానికి అధికారులు ప్రయత్నాన్ని రైతులు తప్పుబడుతున్నారు.

# అద్దంకిలో డయాలసిస్ సెంటర్

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అద్దంకి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.75 లక్షల విలువైన 3 రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. మూడు షిఫ్ట్‌ల్లో రోజుకు 15 మందికి రక్త శుద్ధి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిపై దృష్టి సారించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేశారు. ఈ కేంద్రంతో అద్దంకితో పాటు దర్శి నియోజకర్గంలోని రోగులు డయాలసిస్ కోసం ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు వెళ్ళే వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి. భవన వసతిపై ఇప్పటికి మంత్రి సూచనలతో అధికారులు పరిశీలన కూడా చేశారు. ప్రస్తుతం సీహెచ్‌సీ భవనంలోని కొన్ని గదులను డయాలసిస్ సెంటర్‌కు కేటాయించనున్నారు. ఈ సెంటర్‌కు అవసరమైన నిధులు మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. దీంతో త్వరలోనే డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రానుంది.

# హైస్పీడ్.. సిద్ధం



హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నమూన

- ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్
- గుంటూరు మీదగా హైదరాబాద్ - చెన్నైకు ప్రాజెక్టు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్

**1** తెలంగాణలోని ఖమ్మం మీదగా అమరావతి రాజధాని, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం, చెన్నై ఓఆర్ రోడ్డు మీదగా చెన్నై సెంట్రల్.

**2** హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, దాచేపల్లి(నడికుడి), నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు, చెన్నై ఓఆర్ రోడ్డు, చెన్నై సెంట్రల్.

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే(కన్‌స్ట్రక్షన్స్) విభాగం డీపీఆర్‌ని సిద్ధం చేసి రైల్వేబోర్డుకు నివేదించనున్నది. ఈ కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు కాగా అందులో 504 కిలోమీటర్లు ఏపీలో ఉండగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్ ఉన్నది. ఇప్పుడున్న ఎస్ఎస్ఆర్ రేట్స్ ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని అంచనా. డిజైన్ స్పీడ్ గంటకు 350 కిలో మీటర్లు కాగా ఆపరేషనల్ స్పీడ్ 320 కిలోమీటర్లుగా పొందుపరిచారు. మొత్తం తొమ్మిది రైల్వేస్టేషన్లు రాష్ట్రంలో ఉంటాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపుగా 90.315 హెక్టార్ల అటవీ భూమి అవసరం అవుతుంది. దేశంలో ప్రప్రథమంగా హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కొన్నేళ్ల క్రితం ముంబై - అహ్మదాబాద్ మధ్య నిర్మాణం ప్రారంభించారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. కాగా ఎన్‌డీఏ ప్రభుత్వం మరో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని హైదరా బాద్ - చెన్నై (మిగతా 6వ పేజీలో)

## ఫార్మసీ పరీక్ష ఫలితాలు...

ఏఎన్‌యూ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన ఫార్మసీ రివాల్యూషన్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాద్ విడుదల చేశారు. జూలైలో జరిగిన నానో టెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. వచ్చే నెల 3లోగా రూ.1860 చెల్లించి రివాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## పొగాకు సమాఖ్య పీఐసీ చైర్మన్‌గా జయంతిబాబు

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య (పొగాకు సమాఖ్య) పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ చైర్మన్‌గా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత మండవ జయంత్‌బాబు నియమితులయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పొగాకు పండించే రైతులు వేలాది మంది సభ్యులుగా ఉండే పొగాకు సమాఖ్య ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. ప్రస్తుతం అంతటి పరిస్థితి లేకపోయినా పొగాకు అధికంగా పండే ఈ ప్రాంతంలో ఆ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉండగా ఒంగోలు కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కాగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక నామిటెడ్ పదవుల భర్తీలో పార్టీలో క్రియాశీలకంగా వివిధ నియోజకవర్గాల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈక్రమంలో రైతాంగంలో గుర్తింపు ఉన్న పొగాకు సమాఖ్య పీఐసీ కమిటీని నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీ చైర్మన్‌గా మద్దిపాడు మండలం బసవన్నపాలెంకు చెందిన మండవ జయంత్‌బాబును నియమించగా సభ్యులుగా ఎన్‌జీపాడుకు చెందిన మాచవరపు జాన్, ఒంగోలు నగరపరిధిలోని త్రోవగుంటకు చెందిన కోమటినేని వీరభద్రరావులను నియమించారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. యువకుడైన జయంత్‌బాబు ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. మూడు పర్యాయాలు మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడుగా ఉన్న జయంత్‌బాబు పార్టీ అధికారం కోల్పోయి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేశారు. తన నియామకానికి సహకరించిన ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇతర నేతలకు జయంత్‌బాబు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## డీఆర్సీ సమావేశం వాయిదా

ఒంగోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్షా మండలి(డీఆర్సీ) సమావేశం వాయిదాపడింది. పలు కీలక అంశాలపై సమీక్ష కోసం ఈనెల 24న డీఆర్సీ సమావేశం ఏర్పాటుకు జిల్లా ఇన్‌చార్జీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో డీఆర్సీ సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు ఇతర కీలక ప్రజాప్రతినిధులకు కూడా 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని ప్రకాశం భవనంలోని సమావేశపు హాలులో సమావేశం ఉంటుందని సమాచారం కూడా పంపారు. అయితే తాజాగా నెలకొన్న వాతావరణ పరిస్థితులతో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వారంరోజుల పాటు ఇలాంటి పరిస్థితులే ఉండే అవకాశం కనిపిస్తుంది. ఇదే సమయంలో కార్తీక మాసం కావడంతో వివాహాలు, శుభకార్యాలు అధికంగా ఉన్నాయి. ఒక్కొక్క ఎమ్మెల్యే రోజుకు ఇలాంటివి ఐదారు కార్యక్రమాలకు హాజరు కావాల్సిన ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 24న జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేసి మరోసారి నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరిన నేపథ్యంలో తాత్కాలికంగా సమావేశాన్ని వాయిదా వేయాలని ఇన్‌చార్జీ మంత్రి అధికారులకు సూచించినట్లు సమాచారం. తిరిగి వచ్చే నెల తొలివారంలో జరిగే అవకాశం ఉంది.

## అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలి

దర్శి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దర్శి ఏడీఏ కార్యాలయంలో అధికారి వేధింపులకు మహిళా ఉద్యోగి బలైంది. ఆ అధికారి పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక 20రోజుల క్రితం పురుగుల మందు తాగిన ఆమె చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. దీంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాగా పోలీసులు ఆమె మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో టి.రమణ అనే మహిళా ఉద్యోగి అటెండర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త సుబ్బరాయుడు గతంలో వ్యవసాయాధికారిగా పనిచేశారు. ఆయన కరోనాతో మృతిచెందటంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ఆయన భార్యకు అటెండర్ ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తోంది. గతనెల 29వ తేదీన ఆమె హఠాత్తుగా పురుగు మందు తాగింది. ఆ సమయంలో ఆమె ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందనే విషయం తెలియలేదు. ఒంగోలులో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతిచెందటంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

# ముంపు గ్రామాలపై దృష్టి సారించండి

**తోటవారిపాలెంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**చౌకధరల దుకాణంపై అసంతృప్తి**

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ డాక్టరు వినోద్‌కుమార్ చెప్పారు. బుధవారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం సచివాలయ పరిధిలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈక్రమంలో ముందుగా గ్రామంలోని చౌక ధరల దుకాణంను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పైకప్పు సరిగ్గా లేనందున రేషన్ సరుకు తడిచే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. వెంటనే నిర్వహణ ప్రదేశాన్ని మార్చాలని సూచించారు. అంతేకాకుండా వాడరేవు - చిలకలూరిపేట 167 ఏ జాతీయ రహదారి నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో అధికారులకు సూచించారు. జిల్లా పరిధిలో 92.12 హెక్టార్లకు గాను 89.52 హెక్టార్లలో 3డీ(భూమి సేకరణ సమస్యలకు పరిష్కారం)పూర్తయినట్లు వివరించారు. 2.6 హెక్టార్లు 3డీ పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వాటిని మరో వారంలో పూర్తిచేయాలని సూచించారు. అలాగే జాతీయ రహదారికి సంబంధించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

# దీక్ష ధారులకు అన్నదానం ప్రారంభం

చినగంజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో దీక్షాధారులకు అన్నదాన(సద్ది) కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలోని హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకులు శంకర్‌మిశ్రా, గురుస్వాములు నరహరి హనుమంతరావు, చెరుకూరి రాఘవయ్యల ఆధ్వర్యంలో స్వామికి పడిపూజ చేశారు. అయ్యప్ప, శివ, భవానీ, ఆంజనేయ, వెంకటేశ్వర తదితర దీక్షాధారులకు బుధవారం నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు గ్రామస్థులు, గ్రామానికి చెందిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో డిసెంబరు 11 నుంచి 2026 జనవరి 10వ తేదీ వరకు సద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ తెలిపారు. అయ్యప్పస్వామి దేవస్థానం ఎదురు ముఖ మండపం, గేట్లు ఏర్పాటుకు, మూలికా పురత్తమ్మ అమ్మవారి ఆలయ ముఖ మండపం నిర్మాణ పనులకు ఆలయ కమిటీ చైర్మన్ భూమి పూజ చేశారు. దేవస్థానం ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామికి కుర్రి సుబ్బారావు భార్య సీతామహాలక్ష్మి, కుమార్తె సుభాషిణిల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వెండి వేళా ఆయుధాన్ని బహూకరించారు.



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

## కార్తీక మాసం ప్రారంభం పూజలు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ప్రారంభం రోజు పెద్ద సంఖ్యలో భక్తులు దీక్షధారణ చేశారు. బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావటంతో భక్తులు శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి దీక్షలు చేపట్టారు. పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ ఈ క్రతువు పూర్తి చేశారు. పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాల గుడి, కమలేశ్వరస్వామి దేవాలయంలో పూజలు జరిగాయి.

**దీక్ష ధారులకు అన్నదానం ప్రారంభం**

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడిలో దీక్ష ధారులకు బుధవారం నుంచి అన్నదానం ప్రారంభమైంది. 48 రోజులపాటు రోజూ మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని నిర్వహణ కమిటీ బాధ్యులు మురగొండ ధనుంజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి కంతంరాజు సత్యనారాయణ శర్మ, మానికొండ నాగరాజు పాల్గొన్నారు.

**చినగంజాంలో...**

చినగంజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : శివకేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లోని శైవక్షేత్రాలలో బుధవారం కార్తీకమాస పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శైవక్షేత్రాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అభిషేకాలు తదితర పూజలను నిర్వహించారు. కొత్తపాలెంలోని పార్వతీ సమేత స్వయంభూ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలోని ధ్వజస్తంభం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అయ్యప్ప, శివమాలధారణస్వాములు, మహిళా భక్తులు విశేష పూజలు నిర్వహించి ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు.



పెద్ద సంఖ్యలో దీక్షలు తీసుకున్న భక్తులు

## ముసురు.. ముంపు

(5వ పేజీ తరువాయి)

రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగానే చూపింది. పల్నాడు జిల్లాలోనూ వర్ష ప్రభావంతో వాణిజ్య పంటలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**మరో నాలుగు రోజులు..**

మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో అల్పపీడనం వాయుగుండంగా మారితే గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. 30 నుంచి 70 సెంటీమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు చేసింది.

**జిల్లాలో మూడురోజులు భారీవర్షాలు**

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08643-220226 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తక్షణమే సంప్రదించవచ్చన్నారు.

# మార్కాపురం జిల్లాపై ముందడుగు

**అద్దంకి, కందుకూరు ఒంగోలులోకి..**

**తదనుగుణంగా జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏ ఉన్నతాధికారుల సమీక్ష**

**నివేదికలు ఇవ్వాలని ఆదేశం**

**జనవరికే కొత్త జిల్లాలు వచ్చే అవకాశం?**

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వం ప్రజలు ఆశలు, ఆకాంక్షలను పక్కనపెట్టి జిల్లాల పునర్విభజన చేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాలు 26 జిల్లాలుగా పెరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా మూడు జిల్లాలోకి విభజించారు. ఆ సందర్భంగా ప్రజలు వివిధ రకాల అంశాలను లేవనెత్తారు. బాపట్ల జిల్లాలో కలిసిన అద్దంకి, నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గా లకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిదులు, ప్రజాసంఘాల వారు తమను ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంత ప్రజానీకం మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని మొత్తుకున్నారు. ఈ రెండు అంశాలకు అప్పటి ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ మద్దతుగా నిలవగా, అప్పటి అధికారపార్టీ అయిన వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా ప్రజల ఆకాంక్షలు సబబు అని భావించారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఇవేమి పట్టించుకోకుండా తాను అనుకున్న ప్రకారం కొత్త జిల్లాల కార్యక్రమం ముగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ కందుకూరు నియోజకవర్గంలో పర్యటిస్తూ కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రాంత్రంలో పర్యటిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. అద్దంకిలో పర్యటించేటప్పుడు అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ఓబులేశ్

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చటంలో దూకుడుగా ఉన్న రాష్ట్రప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మరో ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో బుధవారం ఉన్నతాధికారులు రంగంలోకి వచ్చి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబుకు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని, నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. దీంతో వచ్చే జనవరి నాటికే మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పాటు ఒంగోలు కేంద్రంగా కొనసాగే ప్రకాశం జిల్లాలోకి అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను కలిపే అవకాశం ఉంది. బుధవారం కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ ఆయా అంశాలపై సమీక్ష చేశారు.**

**చెప్పిన విధంగానే చర్యలు**

ప్రతిపక్ష నేత హోదాలో పశ్చిమ ప్రాంతానికి వచ్చిన చంద్రబాబునాయుడు మార్కాపురం, గిద్దలూరులో జరిగిన సభల్లో తాము అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు, అద్దంకిలను ఒంగోలులో చేరుస్తామని స్పష్టంగా చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గిద్దలూరు వచ్చినపుడు జనసేన అధినేత, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది అనంతరం ఆ విషయంపై దృష్టి పెట్టి జిల్లాల పునర్విభజనపై మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. ఆ ఉపసంఘం వివిధ రూపాల్లో సమాచారం సేకరించి ఒక నివేదికను రూపొందించింది. అందులో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సంబంధించి మార్కాపురం కేంద్రంగా ఆ జిల్లా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటు అద్దంకి అటు కందుకూరులను ప్రకాశం జిల్లాలో కలపాలని కూడా సూచించారు.

**ఎప్పుడైనా జరగవచ్చు**

ఉన్నతాధికారుల ఆదేశాలను పరిశీలించినా, మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నా వచ్చే జనవరికే జిల్లాల పునర్వ్యస్థీకరణ అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికేనివేదికలు సిద్ధం చేసింది. వివిధ రకాల సాంకేతిక సమస్యలతో ఈ విషయంలో ప్రభుత్వం వేగంగా స్పందించనుందనే ప్రచారం ఉండనే ఉంది. దీంతో ఈ విషయంపై మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రిని సంప్రదించగా మా పని పూర్తయింది.. ఇప్పు డు యంత్రాంగం పని ప్రారంభమవుతుంది.. వచ్చే జనవరికే కొత్త జిల్లాల ఏర్పాటు జరిగినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.. కానిపక్షంలో వచ్చే ఏడాదిలో ఎప్పుడైనా పూర్తవుతుందని తెలిపారు.



కందుకూరు పట్టణం

## కీలక దశ ఆరంభం

కాగా రాజకీయ హామీలు, మంత్రివర్గ ఉపసంఘాలు ఎన్ని నివేదికలు ఇచ్చినా చట్టప్రకారం పని పూర్తిచేయాల్సింది అధికార యంత్రాంగమే. అది ఎప్పుడు జరుగుతుందో అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. ఈ దశలో బుధవారం నాటి పరిణామం ఈ వ్యవహారం తుది దశకు చేరిన సంకేతాన్ని వెల్లడించింది. సీసీఎల్ఏ కమిషనర్ లక్ష్మీ, అదనపు కమిషనర్ మురళీ నిర్వహించిన వీసీలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లను ప్రస్తావిస్తూ జిల్లాల పునర్వ్యస్థీకరణ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారని కలెక్టర్లకు తెలిపారు. ఆ సందర్భంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రస్తావించారు. మార్కాపురంతోపాటు గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాలను ఆ జిల్లాలో భాగస్వామ్యం చేయాలన్న ఆలోచనను తెలిపారు. తదనుగుణంగా మండలాలు, గ్రామాల వారి పరిస్థితిని సమీక్షించింది. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోండి. తదనుగునంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ అలాగే భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారు. అది రెండు, మూడు రోజుల్లోనే అందాలని ప్రత్యేకంగా ఆదేశించటం విశేషం.

అలాగే అద్దంకి, కందుకూరులను ప్రకాశం జిల్లాలోకి కలపాల్సిన అవసరం ఉందని ఆ రెండు నియోజకవర్గాలు, గ్రామాలు, మండలాల వారి హద్దులు భౌగోళిక సరిహద్దులు గుర్తించి వెంటనే నివేదిక పంపాలని బాపట్ల, నెల్లూరు జిల్లాల కలెక్టర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు.

## మణికేశ్వరం వచ్చే భక్తుల కోసం రోడ్డుకు మరమ్మతులు

**అవీఇవీ**



దేవాలయం ముందు చదును చేసే పనులు పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : చినకాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం గ్రామంలో రోడ్డుకు బుధవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కార్తీక మాసంలో ఆ గ్రామంలోని మల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు విపరీతంగా వస్తారు. అలాగే ఎక్స్‌కవేటర్‌తో దేవాలయం ముందు ఖాళీ స్థలం చదును చేయించారు. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు తొలగించాశారు. గోతులను తాత్కాలికంగా పూడ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుంటుపల్లి వాసుబాబు, టీడీపీ నేత షేక్ కరిముల్లా, అశోక్, ఆదినారాయణ, బలరామిరెడ్డి, మౌలాలి, మస్తాన్‌వలి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్!

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం నిర్వాహకులు ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం బకాయి విషయంలో స్పందించకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు.. చలో విజయవాడకు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ వేదికగా నెట్ వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించనున్నారు.

**పేరుకుపోయిన బకాయి..**

బకాయిలు పేరుకుపోవడంతో.. నెలవారి ఖర్చులు రాక వైద్య సిబ్బందిని కుదించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవహారంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది భవిష్యత్తు, ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తుండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యం తాలూక రూ.2,750 కోట్ల బకాయి చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ నేత డాక్టర్ నాగేశ్వరరావు ప్రకాష్ తెలిపారు. ఉచిత వైద్య సేవల ప్యాకేజ్‌ను 2009లో కొంత మేర పెంచారు. ఆ తదుపరి ఇప్పటి వరకు వైద్య ప్యాకేజ్ పెంచలేదు. కొత్తగా ప్రతి పౌరుడిగా వైద్య బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్ల కొందరిని పథకం అమలులో భాగస్వాములను చేయాలని, ప్యాకేజ్‌లను పెంచే విషయంలో వైద్యులతో చర్చలు జరపాలని కోరారు. బకాయి విడుదల చేసే వరకు బందు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉచిత వైద్యం బిల్లులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ ప్రకాష్ కోరారు.

## పత్తి కొనుగోలు..ఉత్తిదేనా!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే పదిరోజులు దాటింది. తాజాగా నిబంధనల సాకు చూపి మొత్తంగానే వైదొలిగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మళ్లీ దళారులే తమకు దిక్కవుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరు వేల ఎకరాల్లో సాగు చేయాలనే మెలిక**

జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలంటే కనీసం 6 వేల ఎకరాల్లో పత్తి సాగు జరగడంతో పాటు.. గతంలో జరిపిన సేకరణ కూడా ఆశాజనకంగా ఉండాలనే నిబంధనలను అధికారులు తెరపైకి తెస్తున్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లా వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో పత్తి సాగయ్యింది. ఇదంతా పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని పది మండలాల పరిధిలోనే ఉన్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దాదాపుగా 40 వేల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతేడాది కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సీసీఐ సేకరించింది జిల్లా వ్యాప్తంగా 13 వేల క్వింటాళ్లుగా ఉంది. నిబంధనల ప్రకారం ఇది చాలా కనిష్ఠమని, ఇదే కాకుండా సాగు విస్తీర్ణం కూడా ప్రతిబంధకంగా మారిందని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంపై నవంబరు మొదటి వారంలో స్పష్టత వస్తుందని యంత్రాంగం చెబుతోంది. ఇదిలా ఉంటే జిల్లాలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని గతంలో మార్కెటింగ్‌శాఖ ప్రకటనను రైతులు గుర్తుచేస్తూ.. ఇప్పుడు నిబంధనల సాకుతో పునరాలోచన చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు

**దిగుబడుల్లో భారీ కోత**

ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు నమోదయ్యాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలో అధికంగా కుండపోత వానలు పలుసార్లు నమోదయ్యాయి. ఈ ప్రభావంతో ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి, ప్రస్తుతం 8 నుంచి 9 క్వింటాళ్లకే పరిమితమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ఉండగా, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 నుంచి రూ.7,500 వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. క్వాలిటీ ఉన్న పత్తికే ఈ ధర చెల్లిస్తున్నారని, లేదంటే రూ.7 వేల దిగువకే అడుగుతున్నారని వాపోతున్నారు.

## హైస్పీడ్.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మధ్య నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ఎలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. అయితే ఈ రెండింటిలో దాచేపల్లి మీదగానే అనువుగా ఉంటుందని ప్రతిపాదించింది. ఆప్షన్-1గా హైదరాబాద్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వే అండ్ తిరుపతి ఎయిర్‌పోర్టు కాగా ఆప్షన్-2ని ఎన్‌హెచ్-65 వెంట గ్రీన్ ఫీల్డ్ ఏరియాలో నుంచి ప్రతిపాదన చేసింది. ఎలైన్‌మెంట్ ఖరారు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. స్టేషన్లు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద 50 ఎకరాల చొప్పున భూమి అవసరం అవుతుంది. 30 నుంచి 40 ఏళ్ల అవుట్‌లుక్‌తో రాష్ట్ర దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌లో దీనిని చేర్చాలి. నిర్ణీత గడువు తేదీ లోపు ఫైనల్ లోకేషన్ సర్వే చేయనున్నందున ఎలాంటి జాప్యం లేకుండా సహకారం అందించాలని కోరింది.

**మూడు జిల్లాల్లో భూసేకరణ..**

- పల్నాడు జిల్లాలో 81 కిలోమీటర్ల పొడవునా ఈ హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరగనున్నది. 7.130 కిలోమీటర్లు అటవీ భూమి కూడా ఉన్నది. దీంతో మొత్తంగా 243 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.
- గుంటూరు జిల్లాలో 66.45 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరగనున్నది. ప్రాజెక్టు కోసం 199.35 హెక్టార్ల ప్రభుత్వ/ప్రైవేటు భూమి అవసరం ఏర్పడుతుంది.
- బాపట్ల జిల్లాలో 43.21 కిలోమటర్ల పొడవునా రైలు మార్గం నిర్మాణం జరగనున్నది. 129.63 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.

**మారిపోనున్న ముఖచిత్రాలు**

హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ముఖచిత్రాలే మారిపోతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రాజెక్టు బాటలు వేయనున్నది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ మధ్య అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది. హెచ్ఎస్ఆర్ స్టేషన్ల వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నందున అక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి.

## నేడు కొత్తపేట పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రారంభం

ఓసీ జనరల్‌కు కేటాయింపు

కొత్తపేట(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎం రాజేష్‌బాబు వెల్లడించారు. పంచాయతీలో మొత్తం 16 వార్డులు ఉండగా అందులో 5 బీసీ, ఒక ఎస్టీ, ఎస్సీ 2, జనరల్ కేటగరీలో 8 కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం 8 పురుషులు, 8 స్థానాలు మహిళలకు కేటాయించామన్నారు. ఆర్వో(రిటర్నింగ్ అధికారి)గా సుబ్బారావు, అసిస్టెంట్ ఆర్వోగా నారాయణను జిల్లా అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉంటే సమయాభావం లేకుండా హఠాత్తుగా ఎన్నికలు రావడంతో ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అసాధారణంగా కనిపిస్తోంది.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంపీడీవో బి. వరూధిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ధర్మవరం, తిమ్మాయపాలెం, మణికేశ్వరం గ్రామాల్లో, 24న శంఖవరప్పాడు, తిమ్మాయపాలెం, కొంగపాడు, 25న శంఖవరప్పాడు, కొటికలపూడి, నాగులపాడు, 26న కలవకూరు, కుంకుపాడు, నాగులపాడు గ్రామాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. 27న శింగరకొండపాలెం, గోపాలపురం, వెంకటాపురం, 28న ఉప్పలపాడు, చక్రాయపాలెం, జార్లపాలెం, 29న వెంపరాల, చిన్నకొత్తపల్లి, ధేనువుకొండ, 30న బొమ్మనంపాడు, గోవాడ, ధేనువుకొండ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆమె కోరారు.

## పంచారామాలకు అద్దంకి డిపో నుంచి బస్సులు

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా అద్దంకి డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇన్‌చార్జి డీఎం మహబూబి తెలిపారు. ఒక రోజులోనే పంచారామాలు అయిన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలో ఉన్న శైవక్షేత్రాలను దర్శించుకునే విధంగా అద్దంకి డిపో నుంచి బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. కార్తీకమాసంలో అక్టోబరు 26, నవంబరు 2, 9, 16 తేదీలలో రాత్రి 9 గంటలకు అద్దంకి నుంచి సూపర్ లగ్జరీ బస్ బయలుదేరి సోమవారం పంచారామాలను దర్శించుకొని రాత్రికి వచ్చే విధంగా బస్‌లు నడుపుతున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1100 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. 35 మంది భక్తులు గ్రూపుగా వస్తే ప్రత్యేక బస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# బదనామ్..!

**నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల రోడ్డు పనులు అసంపూర్తిగా..**

**పుష్కర కాలం నుంచి వాహనదారులకు అవస్థలు**



ఒక వైపు రోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

**అద్దంకి, సంతమాగులూరు మండలాల్లో భూసేకరణకు చెల్లించని పరిహారం**

**ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న టోల్ ఫీజు**

అద్దంకి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్)రోడ్డును ప్రారంభించి పుష్కరకాలానికిపైగా గడిచింది. నేటికీ పలుచోట్ల అసంపూర్తిగా వదిలేసిన పనులతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. అందుకు సంబంధించి రైతులకు నేటికీ పరిహారం చెల్లించలేదు. దీంతో వారూ అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమిళనాడు, దక్షిణ కోస్తా జిల్లాల నుంచి హైదరాబాద్‌కు దగ్గర మార్గంగా ఉండేందుకు 2010లో నామ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మొత్తం 212.5 కి.మీ దూరం ఉన్న ఈ రోడ్డు పనులు అత్యధిక శాతం 2014కు పూర్తి కావటంతో మూడు చోట్ల టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు. పుష్కరకాలంగా టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి ముక్కుపిండి టోల్‌ఫీజ్ వసూలు చేస్తున్నారు. పలుచోట్ల అసంపూర్తిగా ఉన్న పనులు మాత్రం పూర్తి చేయలేదు.



నామ్ రోడ్డు కుంగి ఏర్పడిన గాడులు

**● 15 ఏళ్ల నుంచి భూసేకరణకు చెల్లించని పరిహారం**

ప్రధానంగా బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మండలం గోపాలపురం, చక్రాయపాలెం, సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద అసంపూర్తి పనులు పూర్తి చేయకుండా వదిలివేయటంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. గోపాలపురం వద్ద భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం అందకపోవటంతో పనులను అప్పట్లో అడ్డుకున్నారు. సుమారు 15ఏళ్లుగా పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనులు పూర్తికాకపోవడంతో అక్కడ రెండు రోడ్ల నుంచి వెళ్లాల్సిన వాహనాలు ఒకే రోడ్డులో ప్రయాణిస్తున్నాయి. అదే సమయంలో ఉన్న ఒక్క రోడ్డులో కూడా కుంగి గాడులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**● ప్రభుత్వ మారినా ఆలస్యమే...**

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతం అవుతుందని భావించినా ఆలస్యం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూసేకరణకు సంబంధించి అప్పట్లోనే కొంత మొత్తాన్ని ఒంగోలు ఆర్‌డీవో ఖాతాలో జమ చేశారు. రైతులందరికీ చెల్లించాల్సిన మొత్తంకు సరిపడా లేదని సమాచారం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రైతులకు పరిహారం వెంటనే చెల్లించి నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనచోదకులు కోరుతున్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

**వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో నిర్లక్ష్యం వద్దు**

**జిల్లా స్థాయి సమీక్షలో సీఎండీ పుల్లారెడ్డి**



మాట్లాడుతున్న సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

చీరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వ్యవసాయాధారిత కనెక్షన్ల ఏర్పాటులో నిర్లక్ష్యంగా ఉండరాదని సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి చెప్పారు. బుధవారం చీరాలలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిథిల దశకు చేరుతున్న ట్రాన్స్‌ఫార్మర్లను ముందస్తుగా గుర్తించాలన్నారు. 33 కేవీ, 11 కేవీలలో అంతరాయం శాతం తగ్గించాలని చెప్పారు. అలాగే సబ్సిడీ అందుబాటులో ఉన్న సోలార్ సౌకర్యంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఈఈ జాన్ థామస్, డీఈలు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించండి**

**సీఎండీకు ఆమంచి వినతిపత్రం**

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లుల సమస్యలకు పరిష్కారం చూపాలని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కోరారు. బుధవారం సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిని ఆమంచి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమం తప్పకుండా వేటపాలెం, చినగంజాం ఆక్వా రైతులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అయినా తాజాగా బ్యాక్ బిల్లులు చెల్లించాలని బిల్లులు అందినట్లు సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆమంచి వెంట భాస్కర్ రెడ్డి, తేళ్ల రామయ్య, గిరీ తదితరులు ఉన్నారు.

# డీఎంజీకి గ్రానైట్ పరిశ్రమల యజమానుల వినతిపత్రం



డీఎంజీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, యజమానులు

మార్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గనులు, భూగర్భశాఖ సంచాలకులు చంద్రశేఖర్‌కు బుధవారం మార్టూరు గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో యజమానులు వినతిపత్రం అందజేశారు. విజయవాడ నగర పరిధిలో ఉన్న ఇబ్రహీంపట్నంలో ఉన్న గనులు, భూగర్భశాఖ కార్యాలయంలో డీఎంజీగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్న సమస్యలను చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. మైనింగ్ శ్లాబ్ సిస్టంలో సింగిల్ బ్లేడ్ మిషనుకు, మల్టీ కట్టర్‌కు గతంలో నిర్ణయించిన రేట్లనే శ్లాబ్ సిస్టంలో అనుమతించాలని కోరారు. అదనంగా కావాల్సిన ముడిరాయికి గతంలో క్యూబిక్ మీటరుకు చెల్లిస్తున్న రూ.2 వేల వెయ్యి రూపాయలకు తగ్గించాలని కోరారు. గ్రానైట్ పలకలను పరిశ్రమలు నుంచి కొనుగోలుదారులు కొని తీసుకువెళుతున్న సమయంలో అధికారులు తనిఖీ చేసే సమయంలో కొలతలలో 20 శాతం వ్యత్యాసాన్ని అనుమతించాలని కోరారు. ప్రతి నెలా రాయల్టీ చెల్లిస్తామని, ముడిరాయిని క్వారీల నుంచి తెచ్చుకొనేందుకు 90 రోజుల వరకు గడువును పొడిగించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల యజమానులు చల్లగుండ్ల కృష్ణ, ఇంటూరి ఆంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## వ్యవసాయ సహకార శాఖ అధికారి బదిలీ

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం వ్యవసాయ సహకార సంఘం అధికారి ఎల్ సుధాకరరావు అద్దంకి సహకార సంఘానికి బదిలీ అయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఉన్నతాధికారులు బుధవారం విడుదల చేశారు.

## ఒకేషనల్ కోర్సులు విద్యార్థులకు ఉపయోగకరం




టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీని సందర్శిస్తున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టి ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగమని హెచ్ఎం పి. గంగాధరరావు చెప్పారు. బుధవారం మండలంలోని తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కుంకుపాడు గ్రామంలోని కల్లం టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. అక్కడ ఉత్పత్తి తయారీ విభాగం, ఫ్యాక్టరీకి అవసరమైన పవర్ సప్లయ్ సోలార్ ప్లాంట్ ద్వారా తీసుకోవడం వంటి విషయాలను ఎండీ శివారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ మధుబాబు, పీఈటీ రవి, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.



## భారీ వర్షాలతో రోడ్లు జలమయం



భారీ వర్షంతో పర్చూరు కొట్లబజార్ పరిస్థితి ఇలా

పర్చూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్లపై సైతం పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు కాలనీలు వర్షపు నీటితో మునిగాయి. మండలంలోని అనేక గ్రామాల్లో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే కాలువలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపై చేరటంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. పర్చూరులోని కొట్లబజార్ వీధి మరింత దయనీయంగా మారింది. డ్రైనేజ్ కాలువలను సైతం ఆక్రమించుకొని కట్టడాలను నిర్మాణం చేసుకోవటంతో సమస్య తీవ్ర తరంగా మారింది. దీంతో వర్షం పడింది అంటే రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది.

## ధర్మవరం చెరువులో చేపల పెంపకానికి వేలం పూర్తి

అద్దంకిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరం గ్రామంలో బుధవారం చిన్నచెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనే హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కనీస ధర రూ.7 లక్షలు నిర్ణయించగా కలవకూరుకు చెందిన తన్నీరు చిరంజీవి రూ.10లక్షలకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. వరూధిని, సర్పంచ్ చావాల కళ్యాణి, ఇన్‌చార్జి ఉప ఎంపీడీవో ఎస్. మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శి పల్లా నాగేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**అవీఇవీ**

## కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ముగిసిన అంత్యక్రియలు

విషాదంలో జనకవరం గ్రామం

ఒకే ఇంట మూడు మృతదేహాలతో కలచివేత



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

పంగులూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలతో జనకవరం గ్రామంలో తల్లి, బిడ్డల అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. మంగళవారం రాత్రి తల్లి నాగలక్ష్మి, కుమార్తె అవంతిక, కుమారుడు భువనసాయి మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయి. భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన భర్త కుంచాల రమేష్ కనిపించకుండా పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య నాగలక్ష్మి కన్నబిడ్డలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకున్న తీరు కలచివేసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలు ఇంత ఘోరానికి దారితీయడం ప్రజలను వేదనకు గురిచేసింది. ఒక్క ఇంటిముందు మూడు మార్చురీ బాక్సులలో మృతదేహాలను చూడటం చూపరులను కంటతడిపెట్టించింది. బంధుమిత్రులు, కుటుంబసభ్యుల మిన్నంటిన రోదనలతో బుధవారం వర్షంలోనే ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

## మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్‌ను మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా ప్రమాదానికి గురై గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు నుంచి మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్‌ను బుధవారం మరో మోటార్‌సైకిల్‌కు కట్టుకొని అద్దంకిలోని మెకానిక్ షెడ్‌కు తీసుకు వస్తుండగా శింగరకొండ రోడ్డులోప్రమాదం చోటుచేసుకుంది. ముందు వస్తున్న మోటార్ సైకిల్ సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న బైక్ ఢీ కొట్టింది. దీంతో వెనుక మోటార్‌సైకిల్ నడుపుతున్న బి.రాంబాబుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## కల్వర్టు దిమ్మె ఢీ.. గోతిలో పడిపోయిన లారీ



గోతిలో పడిపోయిన లారీ

మార్టూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో రాజుపాలెం కూడలి సమీపంలో బుధవారం ఉదయం నిద్రమత్తులో లారీ డ్రైవరు రోడ్డు పక్కన కల్వర్టు దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో లారీ రోడ్డు పక్కన గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా దెబ్బతింది. ఒంగోలు నుంచి పొగాకు చెక్కుల లోడుతో పెదకాకాని వెళుతున్న లారీ ప్రమాదానికి గురయ్యింది. డ్రైవరు సుబ్బారావు క్షేమంగా బయటపడ్డారు.

## రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

బంక్ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడి

సీసీ కెమెరాలో దృశ్యాలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు



సిబ్బందిపై దాడికి పాల్పడుతున్న గోపీ(టోపీ పెట్టుకున్న వ్యక్తి)

వేటపాలెం(చీరాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రూ.50 పెట్రోల్ కోసం ఏఆర్ కానిస్టేబుల్ కీర్తి గోపీ వీరంగం సృష్టించాడు. బంకు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం... వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని 216 జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు ఉంది. బచ్చులవారిపాలేనికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గోపీ గతంలో దాదాపుగా రెండేళ్ల హైవే మొబైల్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో ఎంటీ సెక్షన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున అతను మరో ఇద్దరు వ్యక్తులతో పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి రూ.50 పెట్రోల్ అప్పుగా పోయాలని సిబ్బందిని అడిగాడు. వారు నిరాకరించారు. దీంతో గోపీ వీరంగం సృష్టించాడు. ఇరువురు సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. నానా దుర్భాషలాడాడు. ఆ దృశ్యాలంతా సీసీ కెమెరాలో రికార్డు కాగా నిర్వాహకులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఘటనపై విచారణ జరుగుతోంది.

## శింగరకొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం




కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వార్లకు ఈ క్రతువు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ఒంగోలులో వేటపాలెం బాలుడు

● హోంకు తరలింపు

ఒంగోలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దారి తప్పిన పదేళ్ళ బాలుడిని వేటపాలెం హోంకు తరలించారు. బుధవారం ఒంగోలులోని మంగమ్మ కాలేజీ ఎదురుగా రోడ్డు డివైడర్‌పై ఒంటిపై దుస్తులు కూడా లేకుండా పదేళ్ల బాలుడు కూర్చుని ఉన్నాడు. జోరుగా వర్షం పడటంతో చలికి వణుకుతూ ఉండగా అటువైపుగా వెళుతున్న లారీ డ్రైవర్ దండేల కోటేశ్వరరావు చూశాడు. వెంటనే బాలుడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తనది వేటపాలెం అని, తండ్రి పేరు పొన్నం శామ్యూలు అని చెప్పాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వగా హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ సహకారంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ఆదేశాల మేరకు బాలుడిని వేటపాలెం హోంకు ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తరలించారు.



● అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అధికారులంతా వారు పనిచేసే స్థానంలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమని తెలిపారు. కలెక్టరేట్‌లో 0861-2331261, 79965576699 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు.



నెల్లూరు: నగరంలో నీట మునిగిన తల్పగిరి కాలనీ

# వాయుగండం

- జిల్లాలో కొన్ని చోట్ల భారీ, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం
- లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు
- 7 మండలాల్లో 957 హెక్టార్ల పంట నష్టం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది.ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆగాగి వాన పడుతూనే ఉంది. కొన్ని మండలాల్లో భారీగా, మరికొన్ని మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది.దీంతో జనజీవనం స్తంభించింది. బుధవారం జిల్లాలో సరాసరి 67.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆత్మకూరులో 145.6 మి.మీ, దుత్తలూరులో 117.2 మి.మీ, కందుకూరులో 108.8 మి.మీ, అనంతసాగరంలో 103.8 మి.మీ, లింగసముద్రంలో 96 మి.మీ, సైదాపురంలో 93.2 మి.మీ, రాపూరులో 91.2 మి.మీ, సంగంలో 84.2 మి.మీ, వింజమూరులో 84 మి.మీ, ఏఎస్‌పేటలో 83.4 మి.మీ, మర్రిపాడులో 80.2 మి.మీ గుడ్లూరులో 77.2 మి.మీ, నెల్లూరు అర్బన్‌లో 74.2 మి.మీ, మనుబోలులో 74.2 మిమీ, వెంకటాచలంలో 72.4 మి.మీ, నెల్లూరు రూరల్‌లో 67.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



ముత్తుమూరు : సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు



కందుకూరు : భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న ఉప్పుటేరు



మనుబోలు : ఉధృతంగా ప్రవహిస్తున్న కల్లేరు వాగు

## ● నేడు కూడా సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల కారణంగా గురువారం (నేడు) కూడా అన్నీ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు ఇచ్చారని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐఓవో వరప్రసాద్‌రావు తెలిపారు.

## ● పొంగుతున్న వాగులు, వంకలు

ఈ ప్రభావంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దుత్తలూరు మండలం ముత్తరాసిపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మర్రిపాడు మండలం నాయుడుపల్లి వద్ద కేతమన్నేరు వాగు, పెగళ్లపాడు వద్ద బొగ్గేరు పొంగి రహదారులపై ప్రవహిస్తున్నాయి. జలదంకి మండలం గోపన్నపాలెం వద్ద వాగు పొంగి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపేశారు. అనంతసాగరం మండలం ముత్మకూరు వద్ద వాగు ప్రమాదభరితంగా ప్రవహిస్తోంది. వరికుంటపాడు మండలం కనియంపాడు-రామదేవులపాడు గ్రామాల మధ్య పిల్లాపేరు వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. కాగా పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. నెల్లూరులో రోడ్లపై నీరు ప్రవహిస్తుండగా, ఎక్కడికక్కడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఆ నీటిని బయటకు పంపుతున్నారు.



కావలి : రాజీవ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు



అనంతసాగరం : పాతాళపల్లెలో నీట మునిగిన వరిని చూపుతున్న రైతులు

## ● 957 హెక్టార్లలో పంట నష్టం

భారీ వర్షాల కారణంగా కొన్ని మండలాల్లో వరి పైరు కోత దశలో ఉండగా దెబ్బతింది. ఇప్పటి వరకూ 957.4 హెక్టార్లు(2393.50 ఎకరాలు)లో వరి, మినుము, వేరు శనగ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.ఈ నష్టం ప్రధానంగా అనంతసాగం, కలువాయి, చేజర్ల మండలాల్లో జరిగింది. మొత్తం ఏడు మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 796 మంది రైతులు పంట నష్టపోయారు.

## సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. బుధవారం ఉదయం 20 వేల క్యూసెక్కులు కొనసాగగా, సాయంత్రానికి 28 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో డ్యాంలో 69.686 టీఎంసీలు నిల్వ ఉంచి, దిగువకు గేట్ల ద్వారా పెన్నాలోకి 32,650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాగా జలాశయాన్ని ఎస్ఈ వెంకటరమణారెడ్డి, అనంతసాగరం తహసీల్దారు జయవర్ధన్ పరిశీలించారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి దిగువకు నీటి విడుదల పెంచాలని తెలిపారు.

● కండలేరులో 59.910 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.910 టీఎంసీలుగా ఉందని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 5150 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 3050 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.



సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## రాళ్లపాడు వద్ద అప్రమత్తంగా ఉండండి

లింగసముద్రం : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన రాళ్లపాడును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం గురించి ఈఈ మునిత్నం, డీఈఈ ఎం వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రెండు స్పిల్‌వేలలోని గేట్లను పరిశీలించారు. ప్రాజెక్టులో ఏఈలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అధికారులు వివరించారు.దీంతో సబ్ కలెక్టర్ నలుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ పీ శేషయ్య, ఏఈఈ బీ మనోహర్, ఆర్ఐ ఎం రమణయ్య సిబ్బంది ఉన్నారు.



రాళ్లపాడును సందర్శించి, అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ

## సంగం బ్యారేజ్‌కి 68 వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సంగ బ్యారేజ్‌కి సోమశిల జలాశయం, బీరాపేరు, బొగ్గేరు నుంచి సుమారు 68 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుంది. జోరుగా వర్షాలు కురుస్తుండడంతో సోమశిల నుంచి సంగం బ్యారేజ్‌కి సుమారు 32 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నది. దీంతో బీరాపేరు, బొగ్గేరు బీరాపేరు వాగుల నుంచి మరో 36 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి పెన్నాలో కలుస్తుంది.దీంతో బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.8 అడుగులుగా నమోదయింది. బ్యారేజ్ గేట్లకు వరద నీటి ప్రవాహం తగలకుండా 79 గేట్లు పైకెత్తి వచ్చిన వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు.

## నావూరు పెద్దవాగు ఎస్పీ పరిశీలన

పొదలకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నావూరుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నావూరు పెద్దవాగును బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా వరద ఎక్కువ కావడంతో మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఎస్పీ వాగును పరిశీలించి, తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులు, పొదలకూరు సీఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ఎండీ హనీఫ్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వరప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, స్టేషన్ సిబ్బంది రవితేజ, శ్రీను, షరీఫ్, పరుశురాం ఎస్పీ వెంట ఉన్నారు.



## ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొంటాం...

- అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం
- అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ


నెల్లూరు(సిటీ),అక్టోబరు 22,(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ఎలాంటి వైపరీత్యాన్నైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముందుగానే కాలువల్లో పూడికతీత పూర్తయినందున వర్షపునీరు నగరంలో ఎక్కడ ఆగకుండా వెళ్తున్నాయని తెలిపారు. నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తికి సీఎం చంద్రబాబు రూ. 165 కోట్లు విడుదల చేశారని వెల్లడించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద పరిశ్రమలను ఏర్పాటు చేసి, వేల మందికి ఉపాధి కల్పిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా , ఎస్ఎంసీ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● అధికారులు బాగా పనిచేశారు..

నగరంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా కార్పొరేషన్ అధికారులు శ్రమించడాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలో వర్షం తాకిడికి ప్రధాన కూడళ్లు, రహదారుల్లో నీటిని వెంటనే బయటకు వెళ్లేందుకు కమిషనర్ నేతృత్వంలో ఉద్యోగులు, సిబ్బంది పనితీరు ప్రశంసనీయమన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ, పక్కన కలెక్టర్ హిమాన్షు శుక్లా , వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు





రైల్వే శాఖ ప్రతిపాదిత కారిడార్ మ్యాప్



జిల్లా మీదుగా

## బుల్లెట్ పరుగు

- హైస్పీడ్ రైల్ కారిడార్‌కు అడుగులు
- హైదరాబాద్-చెన్నైమధ్య ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో 117 కి.మీ దూరం.. 3 హాల్టింగ్‌లు
- వచ్చే మార్చి నాటికి నివేదిక సిద్ధం

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి మరో కీలక ప్రాజెక్టు చేరువ కాబోతోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన హైస్పీడ్ ట్రైన్ ఎలివేటెడ్ కారిడార్(బుల్లెట్ ట్రైన్) జిల్లా మీదుగా నిర్మాణం జరగడానికి అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ - చెన్నై మధ్య ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్‌ను నిర్మించేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రాథమిక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. హైదరాబాద్ నుంచి గుంటూరు, నెల్లూరు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ మీదుగా చెన్నై ఔటర్‌రింగు రోడ్డు వరకూ ఈ నూతన కారిడార్ నిర్మాణం జరగనుంది. మొత్తం 760 కి.మీ దూరం నిర్మించనున్న ఈ కారిడార్‌ను రైళ్ల గంటకు 350 కిలోమీటర్ల వేగంతో నడిచేలా నిర్మించడానికి ఆలోచన జరుగుతోంది. ఇందులో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 117 కి.మీ మేర ఈ కారిడార్ ఉంటుంది. హైదరాబాద్-చెన్నై మార్గంలో మొత్తం 9 హాల్టింగ్ స్టేషన్లను నిర్మించనున్నారు. అందులో మూడు స్టేషన్లు ఉమ్మడి జిల్లాలో ఉండడం విశేషం. కావలి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో బుల్లెట్ ట్రైన్లు ఆగనున్నాయి. అయితే ఇప్పుడున్న రైల్వే ట్రాక్‌కు సంబంధం లేకుండా ప్రత్యేక రూట్‌మ్యాప్‌లో హైస్పీడ్ ట్రైన్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఒక్కో రైల్వే స్టేషన్‌ను 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు గానూ జిల్లాలో 350.37 హెక్టార్ల భూమి అవసరమవుతుంది. ఆ భూమి మొత్తాన్ని భూసేకరణ చట్టం కింద సేకరించనున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు సుమారు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చేమార్చి నాటికి ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన పూర్తి నివేదికను రైల్వే అధికారులు బోర్డుకు అందజేయనున్నారు. ఈ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే నెల్లూరు నుంచి చెన్నైకు గంటలోపే చేరుకోవచ్చు. అలానే నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు రెండు గంటల్లో చేరుకోవచ్చు.

## బోగస్ హాజరుపై దృష్టి

● విద్యార్థులు, టీచర్ల అటెండెన్స్‌పై గురి ● పాఠశాలల నిర్వహణపై అధికారుల ఫోకస్

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై పాఠశాల విద్యాశాఖ గురిపెట్టింది. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే యాప్‌లో హాజరు నమోదు చేయడంతోపాటు 9.30 గంటలకు హాజరు నివేదికను అధికారులకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో బోగస్ హాజరు నమోదు కాకుండా డీఈవోతో పాటు డిప్యూటీఈవోలు, ఎంఈవోలు ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయులంతా సమయానికి హాజరయ్యేలా పర్యవేక్షిస్తున్నారు. కొత్త ఉపాధ్యాయుల నియామకాలు, ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని విద్యాశాఖ నిర్ణయించింది.



● సమయ పాలనపై...

ఉపాధ్యాయుల సమయపాలనపై దృష్టి సారించిన పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయనున్నది. ఇందులో భాగంగా టీచర్లంతా ప్రతి రోజూ ఉదయం 9 గంటలకే పాఠశాలలకు హాజరు కావాలని, సాయంత్రం 4 గంటల వరకు కచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా లీవ్ పెడితే లీవ్ కూడా 9 గంటలలోపే దరఖాస్తు చేసుకోవాలి. స్పెషల్ డ్యూటీపై వెళితే తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 9.15 గంటలకు అటెండెన్స్ రిపోర్ట్ తీసి పంపించాలి. ఈ రిపోర్ట్‌లో లీవ్ దరఖాస్తు చేయకుండా ఉన్నా, ఇన్‌టైమ్ మార్క్ చేయకున్నా, స్పెషల్ డ్యూటీ పెట్టి హాజరు నమోదు చేయకపోయినా వారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ పదేపదే జరిగితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ ప్రతిరోజూ ఉదయం పది గంటలకు ఆర్జేడీలు, డీఈవోలు, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలతో వెబెక్స్ నిర్వహించనున్నారు.

● ప్రత్యేక సెల్ ఏర్పాటు

జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ సిబ్బంది, టీచర్లంతా కూడా సమయపాలన పాటించి పాఠశాలల ఉన్నతికి పాటుపడాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు. టీచర్ అటెండెన్స్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు ఎవరూ అలసత్వం వహించవద్దని అధికారులు అంటున్నారు. ఆటంకాలను అధిగమించి సమయానికి పాఠశాలలకు చేరుకుని హాజరు నమోదు చేసుకోవాలంటున్నారు. అలాగే సాయంత్రం కూడా పాఠశాల ముగిసిన తరువాత సమయాన్ని తప్పక నమోదు చేయాలి. మధ్యాహ్నం లీవ్ పెట్టేవారు 12.30 గంటల తరువాత మాత్రమే అవుట్ టైట్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఉదయం లీవ్ పెట్టేవారు మధ్యాహ్నం 12.45 లోపు హాజరు నమోదు చేసుకోవాలి.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 123 |
| స్కిన్ చికెన్ | 224 |
| స్కిన్‌లెస్ | 248 |
| కోడిగుడ్ల ధర (100) | 560 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.11847 |
| వెండి కిలో ధర | రూ. 158300 |
| వెండి ఒక గ్రాము | రూ.164.30 |

## గృహనిర్మాణాలకు దరఖాస్తులు చేసుకోవాలి : ఎంపీడీవో

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గ్రామాల్లో పక్కాగృహాలు నిర్మించుకోవాలనుకునే లబ్ధిదారులు నవంబరు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు స్థానిక గృహనిర్మాణశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ



మాలధారులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న సేవాసమితి సభ్యులు

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద మాలధారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి గుడిలో అన్నప్రసాద కార్యక్రమం కొనసాగగా దాతల తోడ్పాటుతో నిర్మించిన శాశ్వత అన్నప్రసాద భవనాన్ని బుధవారం ప్రారంభించి కార్యక్రమాన్ని ఈ భవనంలోనే ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రేపు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమీషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం!



బిట్రకుంట: వర్షపు నీరు తొలగిస్తున్న కార్యదర్శి



కొండాపురం: మిడతవాగు వద్ద తహసీల్దార్ సురేష్‌బాబు

కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అనేక ప్రాంతాలలో చెట్లు, ఫ్లెక్సీలు నేల కొరిగాయి. మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానంద్, డీఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావులు పట్టణంలో పర్యటిస్తూ ముందస్తు రక్షణ చర్యలు చేపడుతున్నారు. పడిపోయిన చెట్లను ఎప్పటి కప్పుడు తొలగిస్తూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అన్నపుగుంట వద్ద వర్షపు నీరు పరిసర ప్రాంతాలలోని ఇళ్లలోకి రాకుండా ముందస్తుగా అక్కడ కాలువలకు అడ్డుగా ఉంటున్న చెత్తా చెదారాలను తొలగించటమే కాక అక్కడ కార్మికులను ఏర్పాటు చేసి చెత్తా చెదారం ఎప్పుడు అడ్డు తగిలినా దానిని తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. ఎక్స్‌కావేటర్‌తో పట్టణంలో పలు ప్రధానమైన కాలువలలో ఉన్న చెత్తను, వర్షపు నీటికి ఆటంకంగా ఉన్న చోట్ల మట్టిని తొలగిస్తూ వర్షపునీరు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టారు. పట్టంలోని శివరామసుబ్బయ్య గిరిజన కాలనీ, చెరువుకట్ట గిరిజన కాలనీలలో గిరిజనులకు ఆహార పొట్లాలు అందచేసి వర్షాలు ఎక్కువైతే సమీపంలో ఉన్న పాఠశాలల భవనాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఇళ్లలో నుంచి బయటకు రావద్దన్నారు.

**తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో**

కావలి డివిజన్‌లోని కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు మండలాల్లోని సముద్ర తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జోరువానలు కురిసే సమయంలో ప్రజలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ల వద్దని తెలిపారు.

**నిలిచి పోయిన ఆర్టీసీ బస్సులు**

భారీ వర్షాలకు కావలి ఆర్టీసీ డిపోనుంచి రాకపోకలు సాగించే పలు బస్సులు నిలిచి పోయాయి. కొమ్మి- కొండాపురం రూట్‌లో గానుగపెంట రూట్‌లో మిడతవాగు ప్రవహిస్తుండటంతో ఆ మార్గాలలో బస్సులు నిలిచి పోయాయి. చామదల, గుడ్లదొన, సిద్దన కొండూరు, రూట్లలో తిమ్మసముద్రం రూట్‌లోనూ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

**అప్రమత్తంగా ఉండండి**

**అల్లూరు :** భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం లోతట్టు ప్రాంతాలైన సింగపేట గిరిజన కాలనీ, అల్లూరు పట్టణ పరిధిలోని చాకిరేవుగుంట, కొండాయగుంట, చింతగుంట, ఉడ్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రభు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**కలిగిరి:** భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎమ్. గిరీష్‌కుమార్ తెలిపారు. ఈవిషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రత్యూష, ఎస్ఐ ఉమాశంకర్‌తోపాటు వివిధశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

**జలదంకి:** ఎడతెరిపిలేని వర్షాలకు జలదంకి మండలంలో పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పలురోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి జలదంకి పంచాయతీ పరిధిలోని టంకంవారిపాలెంలో గోసు గోపాలయ్యకు చెందిన రేకుల ఇల్లు నేలకూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. నేలకూలిన ఇంటిని జలదంకి ఎస్ఐ ఎస్‌డీ లతీఫున్నీసా, ఏఎస్ఐ హరిబాబు పరిశీలించారు. రోడ్లపై ప్రవహిస్తున్న పలు వాగులను పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మండల ప్రజానీకాన్ని అప్రమత్తం చేశారు. గోపన్నపాలెం వద్ద జలదంకి-తెల్లపాడు రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కమ్మవారిపాలెం, చామదల వద్ద వాగులు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాననీరు చేరడంతో వరి మళ్ళు కొంతమేర దెబ్బతిన్నాయి.

**వర్షపు నీటిని తొలగించిన రెవెన్యూ సిబ్బంది**

**బిట్రగుంట:** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట ముస్లింవీధి ఇళ్లలోకి వర్షపు నీరు పోకుండా సర్పంచు గండూరి మంజుల, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జాలయ్య చర్యలు చేపట్టారు. కొండబిట్రగుంట గిరిజన కాలనీలో వాననీరు ఇళ్లలోకి చేరింది. ఇంచార్జి కార్యదర్శి రాజేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజ స్థానిక టీడీపీ నేతలు రావి విజయ్ కుమార్, అశోక్ నీటిని తొలగింపు చర్యలు చేపట్టారు. నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం అరుంధతివాడ అంతర్గత రోడ్లు జలమయంగా మారాయి. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో సర్పంచు మంజుల, గండూరి శ్రీనివాసులు పర్యటించి వారి అప్రమత్తం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు సూచించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించేందుకు సిద్దంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కోవూరుపల్లి డాక్టర్ రామకృష్ణ, ఎస్సై ఎస్.ప్రభాకర్, విద్యుత్, పీఆర్ ఏఈ లు జడరాయ, శ్రీనివాసులు, వ్యవసాయ అధికారిణి శైలజ, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్ ఉన్నారు.

**దగదర్తి (బిట్రగుంట):** వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దారు బీ కృష్ణ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. చవటపుత్తేడు, పెదపుత్తేడు మధ్య ఉన్న పిల్లి వాగును పరిశీలించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ జంపాని కుమార్, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు.

**కొండాపురం:** మండలంలో బుధవారం ఉదయానికి 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మిడతవాగువద్ద నీరు బ్రిడ్జిపైనుండి ఉధృతంగా పారడంతో కొండాపురం- కావలి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ సురేష్ బాబు, ఎస్ఐ మాల్యాద్రి వాగును పరిశీలించారు. ఆదిమూర్తిపురం చెరువుకు నీరు చేరే కాలువ పూడిపోవడంతో తన సొంత నిధులతో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీను పూడిక తీయించారు. సాయిపేట కాలువల్లో పూడికను పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, ఆర్ఐ అనుదీప్, వీఆర్వో శ్రీను తీయించారు.

# కందుకూరు డివిజన్‌లో భారీ వర్షాలు

● పొంగి పొర్లుతున్న వాగులు ● చెరువులకు జలకళ ● వరి, పొగనార్లకు నష్టం

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అలపపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కందుకూరు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువులు జలకళను సంతరించు కుంటున్నాయి. ఉప్పుటేరు ఉగ్రరూపం దాల్చింది. అలాగే ఈ ప్రాంతంలోని మన్నేరు, తూములేరు, పందివాగు, ఎర్రవాగు తదితర వాగులన్నీ పొంగి పొర్లుతున్నాయి. రాళ్లపాడు రిజర్వాయరులో నీటిమట్టం పెరుగుతుండగా ఇరిగేషన్ చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఈ వర్షాలతో నీటికుంటలు పూర్తిస్థాయిలో నిండేసూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది అదనులో కురుస్తున్న వర్షాల వల్ల రబీపైర్ల సాగుకు అనుకూలిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### పొగనార్లు, వరిపైరుకు నష్టం



మాచవరంలో మొలకలు వచ్చిన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

భారీ వర్షాల వల్ల కందుకూరు ప్రాంతంలో పొగనారుమడులకు, కోత దశలో ఉన్న వరిపైరుకు నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కందుకూరు మండలంలోని మాచవరం, మోపాడు గ్రామాలతో పాటు పలు ప్రాంతాలలో సాగుచేసిన వరిపైరు ప్రస్తుతం కోతదశలో ఉందని, తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## రాళ్లపాడు ప్రాజెక్టులోకి 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



రాళ్లపాడు ప్రాజెక్టులో 15 అడుగులకు చేరిన నీటిమట్టం

లింగసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువన కురిసిన వర్షాలకు మన్నేరు, పిల్లాపేరు నుండి నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతోంది. బుధవారం ఉదయం 11 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 7 గంటలకు 15 అడుగులకు చేరింది. సాయంత్రం 4 గంటల వరకు 6వేల వరకు ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరింది. రాత్రి 7 గంటలకు ఇన్‌ఫ్లో 3000 క్యూసెక్కులకు పడిపోయింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే గురువారం ఉదయానికి 16 అడుగులకు నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయితే భారీ వర్షాలు కురుస్తున్నందున తాను, జేఈ మనోహర్, సిబ్బంది ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండేందుకు రాత్రివేళ ప్రాజెక్టు వద్దే బస చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కాగా, భారీ వర్షాలింగ సముద్రంలోని చెరువులకు, మొగిలిచెర్ల, నపవని, పెద పవని తదితర చెరువులకు వర్షపు నీరు చేరుతోంది. ఆర్ ఆర్ పాలెం గ్రామం పక్కనే ఉన్న చెరువుకు సామర్థ్యానికి మించి నీరు చేరడంతో, నీరు చెరువు కట్టపై పొంగి ప్రవహిస్తోంది. కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.











### వెంగమాంబ ఆలయ అభివృద్ధికి

## రూ.10 కోట్లతో ప్రతిపాదనలు : మంత్రి ఆనం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. తొలుత వారికి ఆలయ అర్చకులు, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురాతన చరిత్ర గల వెంగమాంబ ఆలయాన్ని ప్రభుత్వం, దాతల సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, శాశ్విత కట్టడాలు, రాజగోపురాల ఏర్పాటు తదితర నిర్మాణాలకు దేవదాయ శాఖ ఇంజనీర్లు, స్థపతులు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. ఆలయ పరిసరాల్లో రెవెన్యూ భూములను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ వెంగమాంబతోపాటు సీతారామపురం మండలంలో గల శైవక్షేత్రమైన ఘటికసిద్ధేశ్వరం, ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయం, ఉదయగిరి దుర్గంను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ



వెంగమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల, అధికారులు

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్‌ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, ఉండేలా గురవారెడ్డి, కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డు

● ఒకే వేదికపై 12 అవార్డులు

ముత్తుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రమైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ నాణ్యత, నాయకత్వం, సామాజిక సేవల విభాగాల్లో అత్యుత్తమ గుర్తింపును సొంతం చేసుకుంది. తిరుపతిలో బుధవారం క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్‌లో ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డుతో సహా మొత్తం 12 అవార్డులను కంపెనీ కైవశం చేసుకుంది. 'వికసిత్ భారత్ కోసం ఆత్మనిర్భర్' అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ తరఫున సీఎస్ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్ ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డును అందుకున్నారు. కంపెనీ కార్యకలాపాలు, నిర్వహణ అధిపతి సునీల్‌కుమార్ గుప్తాను లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు. కంపెనీలోని ఐదుగురు కైజెన్‌లు బెస్ట్ 5ఎస్ కైజెన్స్ కేటగిరీ గోల్డ్ అవార్డులను అందు




అవార్డులు అందుకుంటున్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ప్రతినిధులు

కున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర అవార్డులు పొందిన తమ బృందాన్ని అభినందించారు. ప్రజల అభిరుచి, నాణ్యత, భద్రత, సామాజిక ప్రభావంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీని ఒక ప్రమాణంగా మార్చాలనే నిబద్ధతకు ఈ అవార్డులు ప్రతీకలుగా నిలిచాయన్నారు. సమాజం పట్ల బాధ్యతతో స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందనే తమ నమ్మకాన్ని ఈ గుర్తింపు బలోపేతం చేస్తుందన్నారు. ఇంధన రంగంలో అగ్రగామిగా కంపెనీ సాధించిన విజయాలే నిదర్శనమన్నారు.

## ఎగసి పడుతున్న అలలు.. ముందుకొస్తున్న సముద్రం



తుమ్మలపెంట వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

కావలి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) దక్షిణమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కావలి రూరల్ మండలం తుమ్మలపెంట తీరంలో బుధవారం సాయంత్రం సముద్రంలో అలలు ఎగసిపడుతూ అలజడి సృష్టించాయి. సముద్రం ముందుకు వస్తూ తీరం కోతకు గురౌతుండటంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. తీరం వెంబడి లోతట్టు ప్రాంతంలో ఉన్న తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకుంటున్నారు. పెద్ద పెద్ద బోట్లను ట్రాక్టర్లలో ఎత్తు ప్రదేశాలకు లాగించి సురక్షితంగా ఉంచారు. అల్పపీడనం కారణంగా ప్రమాద తీవ్రత దృష్ట్యా మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా, సముద్రం వైపు ఎవరూ రాకుండా తీరం వద్ద నిఘా ఉంచారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మనుబోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారిపై కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండూరు సుప్రజ (40) మృతి చెందింది. బంధువుల కథనం మేరకు... మండలంలోని కాగితాలపూరుకి చెందిన కొండూరు వెంకటేశ్వర్లు, సుప్రజ భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వర్లు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుప్రజ తల్లి స్వగ్రామం మండలంలోని గొట్లపాళెం. పనుల నిమిత్తం కుమారుడు రాకేష్‌తో కలిసి సుప్రజ మోటారుసైకిల్‌పై బుధవారం ఉదయం 10 గంటలకు గొట్లపాళెంకు వెళ్లింది. అక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కాగితాలపూరుకు వస్తుండగా క్రాస్‌రోడ్డు వద్ద మలుపులో కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే ఓ ట్రక్కుఆటో మోటార్‌సైకిల్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో రాకేష్, సుప్రజలు ఎగిరి రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనమే సుప్రజ తలపై దూసుకెళ్లింది. దీంతో సుప్రజ అక్కడికక్కడే మృతి చెందింది. గుర్తుపట్టలేనంతగా తల నుజ్జునుజ్జయింది. రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### వక్ఫ్ ఆస్తులు దేవుడివి... !

● రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ ఆస్తులు దేవుడి ఆస్తులని, అవి ముత్తవల్లీల ఆస్తులు కావని రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. బుధవారం రాష్ట్రంలోని ముత్తవల్లీలు, వక్ఫ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్ ఆస్తులకు ముత్తవల్లీలు మేనేజర్లు మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలో ఉన్న వక్ఫ్ ఆస్తులు 700 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విశాఖపట్నంలో 319 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, కర్నూలులో వక్ఫ్ ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయించామని చెప్పారు. ఆస్తులు కాపాడటంలో ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగిస్తే ఏ చట్టం వర్తిస్తోందో అదేచట్టం ముత్తవల్లీలకూ వర్తిస్తుందని, ముత్తవల్లీలు ధైర్యంగా వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆదాయం పెంచి వాటిని పేద ముస్లింల సంక్షేమానికి వినియోగిస్తామని పేర్కొన్నారు. త్వరలో తాలింఏహనర్ పేరుతో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కలిగిన ముస్లిం విద్యార్థులు 500 మందికి వచ్చే విద్యా సంవత్సరం ఉచితంగా ఇంటర్ విద్య అందించబోతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సభ్యుడు బేపారి జాకీర్ అహ్మద్, సీఈవో జాకీర్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జాబ్‌మేళా

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెక్ బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8143227239, 9988853335 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

### 29న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీసు ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక ఈనెల 29వతేదీన నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు, నెల్లూరు క్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 30న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే పోటీలుంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు తాము ప్రస్తుతం విధులు నిర్వహించే కార్యాలయం అధికారి నుంచి పొందిన లేఖతో సంబంధిత తేదీల్లో క్రీడా దుస్తులతో హాజరుకావాలని కోరారు. పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన ఉద్యోగులు విజయవాడ, గుంటూరులో నవంబరు 5 నుంచి 8వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపితే జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని, పూర్తి వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### 30న జడ్పీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉదయం 10.30 గంటల నుంచి జడ్పీ సమావేశమందిరంలో సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. వ్యవసాయ, నీటిపారుదల, వైద్య, ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, ఆర్‌అండ్‌బీ శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

### లంకా దినకర్ పర్యటన వాయిదా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా పర్యటన వాయిదా పడింది. ఆయన గురువారం నెల్లూరులో నిర్వహించాల్సిన సమావేశం వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా పడిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జోయలుక్కాస్ జ్యూయలరీ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, 18 నుంచి 30 సంవత్సరాల వయసు వారు అర్హులని తెలిపారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఎంపికలకు హాజరు కావచ్చని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.22 వేల జీతం, ఇన్సెంటివ్ ఇస్తారని పేర్కొన్నారు. సీఎంఆర్ ఎన్ఎల్ఎం ఈసీవో అల్యూమినియమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎలక్ట్రీషియన్, మెకానికల్, ఎఫ్ఎల్‌టీ డ్రైవర్స్, ఆపరేటర్స్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని 18-35 సంవత్సరాలలోపు వయసు వారు అర్హులని తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమెస్ట్రీ డిగ్రీ పూర్తి చేసిన వారు ఎంపికలకు హాజరు కావచ్చన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

### మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు ముందస్తు బెయిల్

నెల్లూరు (లీగల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకుడు కరకటి మల్లికార్జునపై దాడి, హత్యాయత్నం కేసులో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మరో 13 మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జి యల్ తేజోవతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొడవలూరు పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతి తోపాటు బొచ్చు దాసు, అనపల్లి ఉదయభాస్కర్, వీరి సురేష్, పానేటి శ్రీకాంత్ ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. వారికి కూడా బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

### వలలు, తెప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం నేపథ్యంలో సముద్రంలో చేపల వేట నిలుపుదల హెచ్చరికలు జారీ అయ్యాయని, మత్స్యకారులు వలలు, తెప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మత్స్యశాఖ జేడీ శాంతి ఓ ప్రకటనలో కోరారు. పెద్ద బోట్లను కృష్ణపట్నం, జువ్వలదిన్నె హార్బర్లలో నిలుపుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు సాగర మిత్ర, గ్రామ మత్స్య సహాయకులు, రెవెన్యూ, మెరైన్ పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ వాతావరణానికి చేపలు, రొయ్యల్లో ఆకలి మందగిస్తుందని, సాగుదారులు దాణా తగ్గించాలని సూచించారు. రొయ్యల చెరువుల్లో ఏరేటర్లు వాడాలని, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని, రొయ్యలు కాస్త పెద్ద సైజులో ఉంటే పాక్షికంగా పట్టుకోవడం మంచిదని తెలిపారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలు : నష్ట నివారణ చర్యలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న తుపాల వర్షాల కారణంగా వివిధ పంటలు దెబ్బతిన్నాయి. అయితే రైతులు వెంటనే నష్ట నివారణా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు ఆంధ్రజ్యోతి ద్వారా పలు సూచనలు తెలియచేశారు.

● వేరుశనగ

పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని వీలైనంత త్వరగా తీసేయాలి. ఆకుమచ్చ తెగులును నియంత్రించేందుకు ఎకరాకు టెబుకొనజోల్ 200మి.లీ లేదంటే హెక్సాకొనజోల్ 400మి.లీ డ్రోన్ ద్వారా అయితే 10లీటర్ల నీరు, స్ప్రేయర్ల ద్వారా అయితే 200లీటర్ల నీటితో పిచికారీ చేయాలి. ఐరన్ లోపాన్ని సరిచేసుకునేందుకు ఫెర్రస్ సల్ఫేట్ 5గ్రాములు లీటరు నీటితో పాటుగా సిట్రిక్ యాసిడ్ 1గ్రాము లీటరు నీటితో పిచికారీ చేయాలి. పంట కోతకు సిద్ధంగా ఉంటే వర్షాలు ఆగే వరకు పంట కోత ఆలస్యం చేయాలి.

● మొక్కజొన్న

మొక్కజొన్న పంట 70 నుంచి 90రోజుల వయసులో పూత, గింజ గట్టిపడే దశలో ఉంటుంది. ఈసమయంలో పలంలో నీరు నిలిచిపోతే తప్పనిసరిగా 48గంటల్లోపు తొలగించాలి. నీరు ఎక్కువసేపు నిలిచిపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. నీటిని తొలగించిన



అనంతసాగరం మండలం ఉప్పలపాడులో వర్షాలకు నేలవాలిన వరిపైరు

తరువాత పంట త్వరగా కోలుకునేందుకు 2 శాతం యూరియా(10కిలోలు/హెక్టారుకు), లేదంటే 1శాతం పొటాషియం నైట్రేట్(5కిలోలు/హెక్టారుకు) పిచికారీ చేయడం మంచిది. నీటి ముంపు, అధిక తేమ వాతావరణం వల్ల కాండం/వేరు పూత తెగులు, గింజ బూజు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వాటి నియంత్రణకు కార్బెండజిం 2-3గ్రాములు లేదంటే మెటాలాక్సిల్ 35శాతం డబ్ల్యుఎస్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

● ధాన్యం మొలకెత్తకుండా..

జిల్లాలో కోత దశలోఉన్న వరిపైరు బాగా తడిసిపోయి వాలిపోయి ఉంది. పరిస్థితులను బట్టి పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా దుబ్బలను నిలబెట్టి కట్టలుగా కట్టి నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. కోత కోసిన పనలు పొలంలో ఉంటే వాటిని గట్లపైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించవచ్చు. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలుకాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాకుండా రంగుమారి చెడు వాసన వస్తుంది. ఈ పరిస్థితుల్లో నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక లేదంటే వరిగడ్డి కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండకాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పారబెట్టి నిల్వ చేసుకోవాలి. రంగు మారి తడిచిన ధాన్యాన్ని పచ్చి బియ్యంకంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చు.



లోకేష్‌బాబు

## పరమశివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ

సీతారామపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. కార్తీక మాసం ప్రారంభం కావడం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో నుంచి నీరు వచ్చి పడటంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు జలపాతాన్ని తిలకించేందుకు, త్రిముఖ దుర్గాదేవిని, పరమశివుని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. అయితే నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, హెచ్చరికలు జారీ చేశారు. కాగా, వర్షాలకు భైరవకోన ప్రాంతంలోని కుంటలకు, చెరువులకు నీరు భారీగా వచ్చి చేరుతోంది.





భైరవకోనలో శివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ, కనువిందు చేస్తున్న జలపాతం

## ఏనాడైనా 1వ తేదీ జీతాలిచ్చారా..?

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో ఏనాడూ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇచ్చిన చరిత్ర లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి వెల్లడించారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల డీఏ బకాయిలపై వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉద్యోగులకు దీపావళి కానుకగా ఒక డీఏను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని, బకాయిలను వాయిదాలలో చెల్లిస్తుందని చెప్పారు. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తుంటే, ఎమ్మెల్సీ విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగుల హెచ్ఆర్ఏను తగ్గించటంతోపాటు పెన్షనర్స్ అడిషనల్ క్యాంటమ్ ఆఫ్ పెన్షన్ కూడా 10 శాతం నుంచి 7 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ నాడు ఎందుకు ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. అర్హత లేని వారిని ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదు చేయించి గెలిచిన మీకు ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఎలా ఉంటుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశం లో ఉపాధ్యాయ నాయకులు హజరత్తయ్య, బంగారయ్య, తెలుగు యువత నాయకులు కృష్ణమోహన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి

## తల్లికి తనయ అంత్యక్రియలు

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లికి తనయ అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మండల కేంద్రమైన సంగంలో బుధవారం జరిగింది.వివరాల మేరకు గ్రామానికి చెందిన పెరుమాళ్ల గోపి, ఆదిలక్ష్మి దంపతులు. వీరికి కుమార్తె భార్గవి ఒక్కటే సంతానం. స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా, కరోనా సమయంలో తండ్రి గోపి మృతిచెందగా నాడు అతనికి కుమార్తె భార్గవి అంత్యక్రియలు నిర్వహించింది. మంగళవారం తల్లి ఆదిలక్ష్మి గుండెపోటుతో మృతిచెందడంతో బుధవారం భార్గవి పెద్దల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించింది. తండ్రి, తల్లి ఇద్దరికీ తనయ అంత్యక్రియలు నిర్వహించడం గమనార్హం.



తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె భార్గవి

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కావలి,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కావలి మున్సిపల్ కార్యాలయంవద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంపై నవంబరు 3వ తేదీన పెద్దఎత్తున సమ్మె చేస్తున్నామన్నారు. మున్సిపాల్టీలోని పారిశుధ్య, ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్ట్ తదితర విభాగాలకు చెందిన కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై. ఆదినారాయణ, టీ. వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లె అంకయ్య, సీపీఐ నాయకులు దమ్ము దర్గాబాబు, ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, యూనియన్ నాయకులు

### మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపం ఏర్పాటు



మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపం ఎగురవేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో బుధవారం రాత్రి ఆకాశదీపాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చారు. ఆలయ ఈవో ఆర్‌వీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. మూలస్థానేశ్వరస్వామికి, భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపానికి పూజలు చేసి ఎగురవేశారు. దీంతో ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి తోటలో అఖండ దీపారాధన జరిగింది. తదుపరి మూలస్థానేశ్వరస్వామికి భువనేశ్వరి అమ్మవారికి పేట ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ ముఖ్య అర్చకులు వందవాశి శివకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. కార్తీక మాసోత్సవాలు, భక్తులకు సౌకర్యంగా నిర్వహించేందుకు గురువారం ఉదయం 10గంటలకు అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్డీవో అధ్యక్షతన జరుగుతుందన్నారు.



స్వామి, అమ్మవార్ల పేట ఉత్సవం

### అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసు

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామని డీఎం శివకేశ్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. భక్తులు కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి, తిరుత్తిణి, కాళహస్తి దర్శించి అరుణాచలంలో గిరి ప్రదర్శన, దైవ దర్శనం చేసుకుని తిరిగి బయలుదేరవచ్చని తెలిపారు.

### పాలవల్లికి పలువురి నివాళులు

కావలి (టౌన్) అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి ప్రధాన అనుచరుడు పాలవల్లి పద్మనాభ రెడ్డికి బుధవారం పలువురు నివాళులర్పించారు. జనతాపేట పెద్దపవని రోడ్డు వద్దనున్న పాలవల్లి నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో నియోజకవర్గ పరిధిలోని పలు పార్టీల నాయకులు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని పాలవల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మంచివాడు, మృదుస్వభావి అయిన పాలవల్లి మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్పర్సన్ పీ. అలేఖ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం సుకుమార్ రెడ్డి, విజయ డెయిరీ మాజీ చైర్మన్ సుధీర్ రెడ్డి, బాలకృష్ణంరాజు, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.